8-03-2026

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 63



# నక్సల్స్ రాజకీయాల్లోకి రావాలి

## 130 మంది మావోయిస్టుల సామూహిక లొంగిబాటు

## సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయుధాల అప్పగింత

- లొంగిపోయిన వారిలో 125 మంది ఛత్తీస్‌గఢ్ వాసులు
- కీలక నేతల గన్‌మెన్లు, బెటాలియన్ సభ్యుల నిర్ణయం
- ప్రధాన ఆకర్షణగా నిలిచిన నటి కాకరాల కుమార్తె మాధవి
- జనజీవన స్రవంతిలో కలిసేందుకు ప్రభుత్వం భరోసా



తెలంగాణ రాజకీయ , భద్రతా ముఖచిత్రంలో ఒక కీలక అధ్యాయం ఆవిష్కృతమైంది. దశాబ్దాలుగా అడవిని నమ్ముకుని, తుపాకీ గొట్టం ద్వారానే విప్లవం సాధ్యమని నమ్మిన వారు ఇప్పుడు శాంతి మార్గంలో పయనించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఏకంగా 130 మంది మావోయిస్టులు సామూహికంగా లొంగిపోవడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఈ చారిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. అడవి బాట వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వచ్చిన వీరంతా తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించి, హింసకు స్వస్తి పలుకుతున్నట్లు ప్రకటించారు. ఈ భారీ లొంగిబాటు ప్రక్రియ ఎంతో పకడ్బందీగా సాగింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల నుండి మొత్తం నాలుగు బస్సుల్లో మావోయిస్టులు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకున్నారు. లొంగిపోయిన వారిలో అత్యధికంగా 125 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, నలుగురు తెలంగాణ వారు, ఒకరు ఆంధ్రప్రదేశ్ వాసి ఉన్నారు. దశాబ్దాల కాలంగా మావోయిస్టు ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన వారు సైతం నేడు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకంతో బయటకు రావడం గమనార్హం. 02

# వైఎస్సార్‌కేవీపీ.. రేవంత్‌వేం నరేందర్..!

రాజ్యసభ బరిలో వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ

- కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ పూర్తి.. ఏకగ్రీవం ఖాయం
- సీఎం రేవంత్ రెడ్డి ఆత్మబంధువుకు దక్కిన అరుదైన అవకాశం
- వైఎస్ - కేవీపీల నాటి స్నేహాన్ని గుర్తుచేస్తున్న నేటి బంధం
- టీడీపీ నుంచి కాంగ్రెస్ దాకా.. రేవంత్ వెంటే నరేందర్ రెడ్డి
- రాజకీయాల్లో ‘స్నేహ గీతం’.. పదవుల్లోనూ కొనసాగుతున్న ప్రాధాన్య



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పెద్దల సభ.. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మేధావులు, అనుభవజ్ఞులతో కొలువుదీరే రాజ్యసభకు ఉన్న గౌరవప్రదమైన పేరు ఇది. ఈ సభకు ఎన్నికవ్వడం అంటేనే ఒక ప్రత్యేక గుర్తింపు. అందుకే రాష్ట్రాల్లో రాజ్యసభ స్థానాల ఎంపిక ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. ఒక్కో సీటు కోసం హేమాహేమీలు పోటీ పడుతుంటారు. అయితే తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ గౌరవప్రదమైన స్థానానికి వెళ్లే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత ఆప్త మిత్రుడైన వేం నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. ఇప్పటికే వీరిద్దరూ తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. శాసనసభలో కాంగ్రెస్‌కు ఉన్న సంఖ్యాబలం ప్రకారం చూస్తే వీరి ఎన్నిక లాంఛనమే కానుంది. ఈ ఎంపికలో అందరినీ ఆశ్చర్యపరిచిన పేరు వేం నరేందర్ రెడ్డి. సీనియర్ నేత వి.హనుమంతరావు వంటి ఎందరో ఉద్దండ పిండాలు ఈ సీటు కోసం చివరి నిమిషం వరకు ప్రయత్నాలు చేసినప్పటికీ, అదృష్టం మాత్రం వేం నరేందర్ రెడ్డినే వరించింది. దీని వెనుక ప్రధాన మిగతా 3లో..

## సుందర్ పిచాయ్‌కు రూ.63 వేల కోట్ల జీతం



- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు అల్ఫాబెట్ నుంచి రూ.63 వేల కోట్ల భారీ వేతన పెంపు
- ఈ ప్యాకేజీలో అత్యధిక భాగం పర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలోనే అందజేత
- కంపెనీ లక్ష్యాలను మించి రాణిస్తే బోనస్ విలువ రూ.2,100 కోట్లకు చేరే అవకాశం

02



## ఇరాన్‌పై దాడుల్లో అమెరికా AI పవర్‌ప్లే!

- యుద్ధ క్షేత్రంలో కంటిరెప్ప కాలంలో నిర్ణయాలు తీసుకుంటున్న కృత్రిమ మేధ
- ఉపగ్రహాలు, డ్రోన్ల డేటాను విశ్లేషించి శత్రువుల గుట్టు రట్టు చేస్తోంది
- 24 గంటల్లోనే వెయ్యి లక్ష్యాలను ఛేదించిన అమెరికా సైన్యం
- నిఘా సమాచారాన్ని క్రమబద్ధీకరించి కమాండర్లకు వేగంగా డేటా సరఫరా
- ట్యాంకులు, విమానాల కంటే డేటా విశ్లేషణకే అగ్రతాంబూలం
- 2025 నాటికి 20 వేల మంది సైనికులకు ఏఐ వ్యవస్థతో అనుసంధానం

03

## కర్ణుడు కాదు.. కుంభకర్ణుడు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను తాను కర్ణుడితో పోల్చుకోవడంపై హరీశ్ రావు ఆగ్రహం
- కర్ణుడు త్యాగధనుడని, రేవంత్ మాత్రం హామీలు ఎగ్గొట్టిన క్రూరుడని విమర్శ
- ఆరు గ్యారెంటీలు, రైతుబంధు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ
- హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇళ్లను కూల్చి విధ్వంసం సృష్టించడమే కాంగ్రెస్ పని
- ఎన్నికల సమయంలోనే నిద్రలేచే రేవంత్ అసలైన కుంభకర్ణుడని ఎద్దేవా
- తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ అభివృద్ధికి, నేటి విధ్వంసానికి పొంతన లేదని స్పష్టీకరణ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను తాను పురాణ పురుషుడు కర్ణుడితో పోల్చుకోవడాన్ని బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. చొప్పదండి నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి అసలు కర్ణుడు కాదని, మిగతా 3లో..



## నేడు టీ20 ప్రపంచకప్ ఫైనల్

- అహ్మదాబాద్‌లో పొట్టి క్రికెట్ సంగ్రామం.. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ ఫైనల్
- మూడోసారి టైటిలే లక్ష్యంగా సూర్యకుమార్ యాదవ్ సేన సమరశంఖం
- తొలిసారి విశ్వవిజేతగా నిలవాలని కసితో ఉన్న కివీస్ 'బ్లాక్ క్యాప్స్'

02



## ‘ఎపిక్ ఫ్యూరీ’తో దద్దరిల్లుతున్న టెహ్రాన్!

- ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు.. 8వ రోజుకు చేరిన యుద్ధం
- ‘ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ’లో 3 వేల లక్ష్యాలు ధ్వంసం.. ఇరాన్ నావికాదళం క్లీన్ స్వీప్
- లెబనాన్‌పై బాంబుల వర్షం.. ఇజ్రాయెల్ దాడుల్లో 41 మంది దుర్మరణం
- దుబాయ్ విమానాశ్రయం వద్ద కూలిన క్షిపణి శిథిలాలు.. గగనతలంలో టెన్షన్
- భారత పౌరులకు ఖతార్ ఎంబసీ అడ్వైజరీ.. విమానాలు నడుపుతున్న ఎయిరిండియా
- తాను ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ ప్రెసిడెంట్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

03

## చిన్న సినిమాలకు పెద్ద కటౌట్

- తెలంగాణ అస్తిత్వానికి పెద్దపీట వేస్తూ 'గద్దర్ అవార్డుల' ప్రకటన
- వరుసగా రెండో ఏడాది కూడా చిన్న చిత్రాలదే హవా
- నేలతల్లి కథలకు, గ్రామీణ సంస్కృతికి దక్కిన అగ్రతాంబూలం
- రాజు వెడ్స్ రాంబాయి, దండోరా చిత్రాలకు అవార్డుల పంట
- ఉగాది పర్వదినాన పురస్కారాల ప్రదానానికి సన్నాహాలు
- విజేతలందరూ హాజరు కావాలంటూ ప్రభుత్వం స్పష్టమైన సంకేతం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సినిమా అంటే కేవలం రంగుల ప్రపంచమో, వందల కోట్ల వసూళ్ల లెక్కలో మాత్రమే కాదని తెలంగాణ ప్రభుత్వం మరోసారి నిరూపించింది. ప్రస్తుత కాలంలో అవార్డులు కూడా కమర్షియల్ హంగులు అద్దుకుని, కేవలం స్టార్ పవర్ ఉన్న సినిమాలకే పరిమితమవుతున్న వేళ, గద్దర్ అవార్డులు సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాయి. ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరుతో మిగతా 2లో..

## వాహనదారులకు బిగ్ రిలీఫ్

- పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఇప్పుడప్పుడే ఉండదు
- కేంద్ర ప్రభుత్వ వర్గాల కీలక ప్రకటనతో ఊరట
- ఇంధన నిల్వలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం
- వ్యూహాత్మక ముడి చమురు దిగుమతులతో తగ్గిన ఇబ్బందులు
- వంటగ్యాస్ వినియోగదారులకు మాత్రం తప్పని తిప్పలు
- అంతర్జాతీయ సరఫరా గొలుసుపై కేంద్రం నిరంతర నిఘా

03

# నక్సల్స్ రాజకీయాల్లోకి రావాలి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ పరిణామం మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బగా భద్రతా దళాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా మావోయిస్టు పార్టీలో కీలక నేతలుగా గుర్తింపు పొందిన దేవ్‌జీ, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డి, మల్లా రాజిరెడ్డిల వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఈ బృందంలో ఉండటం విశేషం. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం ప్రభుత్వం ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. దీంతో పాటు పార్టీలోని సాంకేతిక విభాగం కూడా కుప్పకూలినట్లు కనిపిస్తోంది. కంప్యూటర్ సిగ్నల్ ఆపరేటర్లు, పీఎల్‌జీఏకు చెందిన ఒక పూర్తిస్థాయి బెటాలియన్ ఈ లొంగిబాటులో భాగస్వామ్యమయ్యారు. ఇది పార్టీ వ్యూహరచన, కమ్యూనికేషన్ వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉంది. ఈ లొంగిబాటులో మరో ఆసక్తికర అంశం సినీ రంగంతో ముడిపడి ఉంది. సీనియర్ సినీ నటుడు కాకరాల సత్యనారాయణ కుమార్తె మాధవి కూడా లొంగిపోయిన వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. విద్యావంతురాలు, సామాజిక స్పృహ కలిగిన ఆమె ఏ పరిస్థితుల్లో అడవి బాట పట్టారు, మళ్లీ ఇప్పుడు ఎందుకు తిరిగి వచ్చారనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆమెతో పాటు అనేక మంది మహిళా మావోయిస్టులు కూడా తుపాకులు వదిలి సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు రావడం సమాజంలో మారుతున్న ఆలోచన ధోరణికి నిదర్శనంగా నిలుస్తోంది. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు ఈ సామూహిక మార్పునకు ప్రధాన కారణమని తెలుస్తోంది. హింసను వీడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, లొంగిపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం ఇచ్చిన హామీ వీరిలో ధైర్యాన్ని నింపింది. అడవిలో ఉండి ఆరోగ్యం కోల్పోవడం కంటే, సమాజంలో ఉండి కుటుంబ సభ్యులతో గడపడమే మేలని తాము భావించినట్లు లొంగిపోయిన కొందరు సభ్యులు తమ అంతరంగిక సంభాషణల్లో వ్యక్తం చేశారు. ప్రభుత్వ పునరావాస పద్ధతులు కూడా వీరిని ఆకర్షించాయి. డీజీపీ శివధర్ రెడ్డి ఈ సందర్భంగా లొంగిపోయిన వారి వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ 130 మందిలో ముగ్గురు స్టేట్ కమిటీ సభ్యులు, పదిమంది డివిజనల్ కమిటీ సభ్యులు, నలభై మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇంత పెద్ద సంఖ్యలో కేడర్, కీలక నేతలు లొంగిపోవడం ఇదే మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖ తీసుకున్న నిరంతర నిఘా, క్షేత్రస్థాయిలో వారు చేస్తున్న కౌన్సెలింగ్ ఫలితాలే నేడు కనిపిస్తున్నాయని ఉన్నతాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మావోయిస్టులు తమ ఆయుధాలను ముఖ్యమంత్రికి, పోలీసు ఉన్నతాధికారులకు అప్పగించిన తీరు ఎంతో భావోద్వేగంగా సాగింది. ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్లు, గ్రెనేడ్లను వారు టేబుల్స్ పై ఉంచి విప్లవ గీతాల నుండి శాంతి నినాదాల వైపు మళ్లారు. లొంగిపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందించడంతో పాటు, వారిపై ఉన్న కేసుల విషయంలో చట్టపరమైన వెసులుబాటు కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఇది కేవలం ఒక లొంగిబాటు మాత్రమే కాదు, ఒక కొత్త జీవితానికి నాంది అని ఆయన ఆకాంక్షించారు. నేటి తరం యువత విప్లవం పేరుతో ఆయుధాలు పట్టడం కంటే, సాంకేతికతను అందిపుచ్చుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని సీఎం ఈ సందర్భంగా సూచించారు. లొంగిపోయిన వారిలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ల నైపుణ్యాన్ని సమాజహితం కోసం వాడుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. హింస ద్వారా సాధించేది ఏమీ లేదని, చర్చలు, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే సమస్యల పరిష్కారం సాధ్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# నేడు టీ20 ప్రపంచకప్ ఫైనల్

- అహ్మదాబాద్‌లో పొట్టి క్రికెట్ సంగ్రామం.. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ ఫైనల్
- మూడోసారి టైటిలే లక్ష్యంగా సూర్యకుమార్ యాదవ్ సేన సమరశంఖం
- తొలిసారి విశ్వవిజేతగా నిలవాలని కసితో ఉన్న కివీస్ 'బ్లాక్ క్యాప్స్'
- బుమ్రా, అర్ష్‌దీప్ బౌలింగ్ వర్సెస్ ఫిన్ అలెన్, సీఫెర్ట్ బ్యాటింగ్
- రికార్డుల ముంగిట హార్దిక్ పాండ్యా; సూపర్ ఫామ్‌లో స్కై, సంజూ శాంసన్
- రాత్రి 7 గంటలకు ప్రారంభం. ప్రత్యక్ష ప్రసారం స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో



**విశాలభారతి, క్రీడలు:**

క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆ చారిత్రక తరుణం రానే వచ్చింది. పొట్టి క్రికెట్ సంగ్రామంలో విశ్వవిజేత ఎవరో తేల్చేందుకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం మార్చి 8న జరగనున్న టీ20 ప్రపంచకప్ ఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, పోరాట పటిమకు మారుపేరైన న్యూజిలాండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. గత ఏడాది 2024లో సాధించిన ఘనతను నిలబెట్టుకుని, మూడోసారి విశ్వవిజేతగా నిలిచేందుకు సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా ఉవ్విళ్లూరుతుండగా, మరోవైపు తమ దశాబ్దాల తొలి టైటిల్ కల సాకారం చేసుకోవాలని కివీస్ పట్టుదలగా ఉంది. టోర్నీ ఆసాంతం ఇరు జట్లు అద్భుత ప్రదర్శన కనబరిచి ఫైనల్‌కు చేరడంతో, ఈ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ మెగా ఫైనల్‌లో ప్రధానంగా భారత పేస్ బౌలింగ్ విభాగానికి, న్యూజిలాండ్ టాప్ ఆర్డర్ బ్యాటర్లకు మధ్య జరిగే పోరు మ్యాచ్ ఫలితాన్ని శాసించే అవకాశం ఉంది. ఈ టోర్నీలో భారత బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ పవర్ ప్లేతో పాటు డెత్ ఓవర్లలోనూ అద్భుతంగా రాణిస్తూ ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తున్నారు. ముఖ్యంగా మొదటి ఆరు ఓవర్లలో భారత్ కేవలం 7.5 ఎకానమీ రేటును నమోదు చేసి పరుగుల ప్రవాహాన్ని కట్టడి చేస్తోంది. బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ అర్ష్‌దీప్ వికెట్లు పడగొడుతుంటే, బుమ్రా తన ఖచ్చితమైన యార్కర్లతో బ్యాటర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. వీరిద్దరి ధాటికి కివీస్ ఓపెనర్లు ఎంతవరకు నిలబడతారన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

అయితే కివీస్ ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్, ఫిన్ అలెన్ భీకర ఫామ్‌లో ఉండటం భారత్‌కు పెద్ద సవాల్‌గా పరిణమించింది. ఈ టోర్నీలోనే అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన అలెన్, అత్యధిక స్ట్రైక్ రేట్‌తో బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు. అతని విధ్వంసకర బ్యాటింగ్ తీరు గనుక మొదలైతే ఏ బౌలర్‌కైనా కష్టకాలమే. ఇక సీఫెర్ట్‌కు భారత్‌పై మంచి రికార్డు ఉంది; బ్లాక్ క్యాప్స్ తరపున భారత్‌పై అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా సీఫెర్ట్ రికార్డు సృష్టించాడు. ఈ ఓపెనింగ్ జోడీని భారత బౌలర్లు ఎంత త్వరగా పెవిలియన్‌కు పంపిస్తారన్నదానిపైనే మ్యాచ్ గమనం మరియు టీమిండియా విజయావకాశాలు పూర్తిగా ఆధారపడి ఉంటాయి. భారత స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ ప్రపంచకప్‌లో సంచలన ఫామ్‌లో ఉండి జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నాడు. ఇప్పటివరకు 199 పరుగులు చేయడంతో పాటు 8 వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన హార్దిక్, ఒకే టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో 200 పరుగులు, 10 వికెట్లు తీసిన తొలి భారతీయ ఆటగాడిగా చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో ఉన్నాడు. కీలక సమయంలో బ్యాటుతో మెరుపులు మెరిపించడం, బంతితో వికెట్లు తీస్తూ ప్రత్యర్థి భాగస్వామ్యాలను విడదీయడంలో హార్దిక్ సిద్ధహస్తుడు. ఈ ఫైనల్ పోరులో కూడా అతను అదే తరహా ప్రదర్శన ఇస్తే భారత్ గెలుపు నల్లేరుపై నడకే అవుతుంది. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తనదైన శైలిలో 360 డిగ్రీల షాట్లతో అలరిస్తున్నాడు. న్యూజిలాండ్‌పై ఇప్పటివరకు 58.44 సగటుతో 526 పరుగులు చేసిన స్కై, ఫైనల్‌లోనూ తన బ్యాట్ ఝుళిపించాలని కసితో ఉన్నాడు. మరోవైపు వెస్టిండీస్, ఇంగ్లండ్‌పై వరుసగా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు గెలుచుకున్న సంజూ శాంసన్ కూడా సూపర్ ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశం. శాంసన్ మిడిల్ ఆర్డర్‌లో ఇచ్చే వేగవంతమైన పరుగులు స్కోరు బోర్డును పరుగులు పెట్టిస్తాయి. అయితే శాంసన్‌ను అడ్డుకునేందుకు కివీస్ ప్రధాన బౌలర్ మ్యాట్ హెన్రీ ప్రత్యేక వ్యూహాలతో సిద్ధమయ్యాడు.

గణాంకాలు మరియు ప్రస్తుత ఫామ్ భారత్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, చరిత్ర మాత్రం కివీస్ వైపే మొగ్గు చూపుతుండటం ఆందోళన కలిగించే విషయం. టీ20 ప్రపంచకప్ చరిత్రలో న్యూజిలాండ్‌పై భారత్ ఇప్పటివరకు ఒక్కసారి కూడా విజయం సాధించలేకపోయింది. ఐసీసీ టోర్నీలలో కివీస్ ఎప్పుడూ టీమిండియాకు కొరకరాని కొయ్యగా మారుతూ వస్తోంది. దీనికి తోడు అహ్మదాబాద్ వేదికగా గతంలో జరిగిన కీలక ఐసీసీ ఈవెంట్లలో టీమిండియాకు కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఈ ప్రతికూలతలను అధిగమించి, సొంతగడ్డపై వరుసగా రెండోసారి కప్పు గెలిచి పాత రికార్డులను తిరగరాయాలని భారత సేన పట్టుదలగా ఉంది.

భారత్ తరపున యువ రక్తం కూడా ఈసారి గట్టిగానే స్పందిస్తోంది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ లాంటి కుర్రాళ్లు పవర్ ప్లేలో మెరుపులు మెరిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. స్పిన్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ మాయాజాలంపై భారీ అంచనాలు ఉన్నాయి. అహ్మదాబాద్ పిచ్ స్పిన్నర్లకు కొంత మేర సహకరించే అవకాశం ఉండటంతో, వీరిద్దరూ కివీస్ బ్యాటర్లను ఏ మేరకు కట్టడి చేస్తారనేది కీలకం. అక్షర్ పటేల్ కూడా ఆల్ రౌండ్ ప్రదర్శనతో జట్టుకు అదనపు బలాన్ని ఇస్తున్నాడు. టీమిండియా సమతూకంతో కూడిన బృందంగా కనిపిస్తూ ట్రోఫీపై గురి పెట్టింది.

మరోవైపు న్యూజిలాండ్ జట్టు కూడా భారత్‌ను దెబ్బకొట్టేందుకు బలమైన ప్రణాళికలతో ఉంది. ముఖ్యంగా భారత్‌పై టీ20ల్లో 30 వికెట్లు తీసిన ఘనమైన రికార్డు ఉన్న స్పిన్నర్ ఇష్ సోధీని తుది జట్టులోకి తీసుకోవాలని బ్లాక్ క్యాప్స్ యోచిస్తోంది. శాంట్నర్ నాయకత్వంలో కివీస్ ఫీల్డింగ్ కూడా అత్యున్నత స్థాయిలో ఉంటుంది. రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్ లాంటి ఆటగాళ్లు ఏ సమయంలోనైనా మ్యాచ్ ఫలితాన్ని మార్చగల సత్తా ఉన్నవారు. తమదైన రోజున ఎంతటి లక్ష్యాన్నైనా ఛేదించగల సామర్థ్యం కివీస్ సొంతం. కాబట్టి భారత్ ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా మూల్యం చెల్లించుకోక తప్పదు. అహ్మదాబాద్‌లోని లక్షకు పైగా ప్రేక్షకుల సమక్షంలో జరిగే ఈ చారిత్రక పోరులో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి. ఒకవైపు కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలు, మరోవైపు మొదటి టైటిల్ కోసం కివీస్ పోరాటం.. ఈ రెండింటి మధ్య సాగే ఈ యుద్ధం క్రికెట్ చరిత్రలో నిలిచిపోవడం ఖాయం. మైదానంలో ఆటగాళ్ల మధ్య వైరం ఉన్నా, క్రీడా స్ఫూర్తితో సాగే ఈ పోరు అభిమానులకు అసలైన వినోదాన్ని పంచుతుంది. ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్న ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌ను వీక్షించేందుకు యావత్ ప్రపంచం సిద్ధమైపోయింది. ప్రస్తుత ఫామ్ చూస్తుంటే టీమిండియాకే విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. సూర్యకుమార్ యాదవ్ తన కెప్టెన్సీలో భారత్‌కు మరో ప్రపంచకప్ అందిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, జియో హాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉండటంతో ఇంటి వద్దే ఉండి ఈ మహా సంగ్రామాన్ని ఆస్వాదించవచ్చు. భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటుందా లేక కివీస్ కొత్త చరిత్రను లిఖిస్తుందా అన్నది మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

# సుందర్ పిచాయ్‌కు రూ.63 వేల కోట్ల జీతం

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు అల్ఫాబెట్ నుంచి రూ.63 వేల కోట్ల భారీ వేతన పెంపు
- ఈ ప్యాకేజీలో అత్యధిక భాగం పర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలోనే అందజేత
- కంపెనీ లక్ష్యాలను మించి రాణిస్తే బోనస్ విలువ రూ.2,100 కోట్లకు చేరే అవకాశం
- వేమో, వింగ్ వంటి వినూత్న విభాగాల్లోనూ పిచాయ్‌కు ప్రత్యేక వాటాలు
- పిచాయ్ సారథ్యంలో గూగుల్ విలువ రూ.300 లక్షల కోట్లు దాటిన అద్భుత ప్రస్థానం
- సత్య నాదెళ్ల, టిమ్ కుక్ వంటి దిగ్గజ సీఈఓల కంటే భారీ స్థాయికి చేరిన పిచాయ్ వేతనం

**విశాలభారతి, జాతీయం:**



టెక్ ప్రపంచంలో గూగుల్ సామ్రాజ్యాన్ని తిరుగులేని శక్తిగా నిలబెట్టిన భారతీయ సంతతి దిగ్గజం, సుందర్ పిచాయ్‌పై కాసుల వర్షం కురుస్తోంది. గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ తన సారథికి కళ్లు చెదిరే రీతిలో వేతన పెంపును ప్రకటించి అంతర్జాతీయ కార్పొరేట్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. రాబోయే మూడేళ్ల కాలానికి గాను పిచాయ్ మొత్తం పారితోషికాన్ని సుమారు రూ.63 వేల కోట్లుగా నిర్ణయించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ భారీ ప్యాకేజీతో ప్రపంచంలోనే అత్యధిక వేతనం పొందుతున్న శక్తివంతమైన సీఈఓల జాబితాలో పిచాయ్ అగ్రస్థానానికి చేరుకున్నారు. ఒక సామాన్య మధ్య తరగతి నేపథ్యం నుంచి వచ్చి, నేడు ప్రపంచ టెక్ రంగ గమనాన్ని శాసిస్తున్న పిచాయ్ ప్రస్థానంలో ఇదొక అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. సాధారణంగా కార్పొరేట్ దిగ్గజాలకు ఇచ్చే పారితోషికం కేవలం నెలవారీ జీతం రూపంలోనే ఉండదు. పిచాయ్‌కు ప్రకటించిన ఈ మెగా ప్యాకేజీలో సింహభాగం పర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలో ఉండటం విశేషం. వీటి ప్రాథమిక విలువ సుమారు రూ.1,050 కోట్లుగా ఉన్నప్పటికీ, కంపెనీ నిర్దేశించుకున్న ఆర్థిక లక్ష్యాలను అంచనాలకు మించి సాధిస్తే ఈ మొత్తం రూ.2,100 కోట్ల వరకు పెరిగే వెసులుబాటు ఉంది. అల్ఫాబెట్ తన షేర్ హోల్డర్లకు అందించే లాభాలను ఎస్ అండ్ పీ 100 సూచీలోని ఇతర దిగ్గజ కంపెనీలతో పోల్చి చూసి, ఆ ప్రదర్శన ఆధారంగానే ఈ స్టాక్ బోనస్‌ను ఖరారు చేయనున్నారు. అంటే సంస్థ లాభాల బాటలో పయనిస్తేనే పిచాయ్ సంపద రెట్టింపు అవుతుందన్నమాట.

స్టాక్ రివార్డులతో పాటు పిచాయ్‌కు మరో రూ.700 కోట్ల విలువైన రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్లను కూడా కేటాయించారు. ఇవి ఆయన సంస్థలో కొనసాగుతున్న కాల పరిమితిని బట్టి దశలవారీగా విడుదలవుతాయి. వీటికి అదనంగా ప్రతి ఏటా సుమారు రూ.16 కోట్ల నగదు వేతనం కూడా లభిస్తుంది. సాధారణంగా టెక్ కంపెనీలు తమ కీలక నేతలను సంస్థలోనే సుదీర్ఘకాలం కొనసాగేలా ప్రోత్సహించడానికి ఇటువంటి 'స్టాక్ బేస్డ్ కాంపెన్సేషన్' పద్ధతిని అనుసరిస్తుంటాయి. ఇది సీఈఓ వ్యక్తిగత ప్రయోజనాలను కంపెనీ ఎదుగుదలతో ముడిపెట్టే ఒక వ్యూహాత్మక చర్యగా విశ్లేషకులు భావిస్తున్నారు. అల్ఫాబెట్ కేవలం గూగుల్‌కే పరిమితం కాకుండా భవిష్యత్తు అవసరాల కోసం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ విభాగాల్లో భారీ పెట్టుబడులు పెడుతోంది. ఇందులో భాగంగా స్వయం నియంత్రిత వాహన రంగంలో సంచలనాలు సృష్టిస్తున్న 'వేమో', డ్రోన్ డెలివరీ సర్వీస్ 'వింగ్' వంటి ప్రాజెక్టుల్లోనూ పిచాయ్‌కు ప్రత్యేక వాటాలను ప్రకటించారు. సుమారు రూ.1,080 కోట్ల విలువైన వేమో షేర్లతో పాటు రూ.370 కోట్ల విలువైన వింగ్ ఏవియేషన్ షేర్లు ఈ ప్యాకేజీలో భాగంగా ఉన్నాయి. కృత్రిమ మేధ, రోబోటాక్సీల వంటి భవిష్యత్తు సాంకేతికతలపై పిచాయ్ మరింత దృష్టి సారించేలా ఈ ప్రోత్సాహకాలు ఉపయోగపడనున్నాయి. వేమో విషయానికి వస్తే ఇది డ్రైవర్ అవసరం లేకుండానే ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఏఐ ఆధారిత రోబోటాక్సీ సేవలను అందిస్తోంది. ఇప్పటికే అమెరికాలోని ఫీనిక్స్, శాన్ ఫ్రాన్సిస్కో వంటి నగరాల్లో ఎలక్ట్రిక్ జాగ్వార్ కార్ల ద్వారా ఈ సేవలు విజయవంతంగా నడుస్తున్నాయి. మరోవైపు వింగ్ ఏవియేషన్ డ్రోన్ల ద్వారా మందులు, ఆహార పదార్థాలను నేరుగా వినియోగదారుల ఇళ్లకే చేర్చే అత్యాధునిక డెలివరీ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ఈ రెండు ప్రాజెక్టులు భవిష్యత్తులో అల్ఫాబెట్ ఆదాయ వనరులను విప్లవాత్మకంగా మార్చేస్తాయని భావిస్తున్నారు. సుందర్ పిచాయ్ 2015లో గూగుల్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సంస్థ మార్కెట్ విలువ ఊహించని రీతిలో పెరిగింది. ఆయన పదవిని చేపట్టిన సమయంలో గూగుల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.44 లక్షల కోట్లుగా ఉండగా, నేడు అది ఏకంగా రూ.300 లక్షల కోట్ల మార్కును అధిగమించింది. ఇటీవల కాలంలో ఇది రూ.330 లక్షల కోట్ల రికార్డు స్థాయిని కూడా తాకింది. ఈ అసాధారణ వృద్ధిరేటే పిచాయ్ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తోంది. సెర్చ్ ఇంజిన్ నుంచి ఏఐ వరకు గూగుల్‌ను నంబర్ వన్‌గా ఉంచడంలో ఆయన కృషి అనన్యసామాన్యం.

ప్రస్తుతం 53 ఏళ్ల పిచాయ్ 2004లో ఒక సాధారణ ఉద్యోగిగా గూగుల్‌లో ప్రవేశించారు. క్రోమ్ బ్రౌజర్ సృష్టికర్తగా, ఆండ్రాయిడ్ విభాగాధిపతిగా ఆయన చూపిన చొరవ సంస్థను గ్లోబల్ లీడర్‌గా మార్చింది. మధ్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో గూగుల్ కొంత నెమ్మదించిందనే విమర్శలు ఎదురైనప్పటికీ, పిచాయ్ తనదైన శైలిలో అత్యాధునిక ఏఐ మోడళ్లను ప్రవేశపెట్టి ఆ లోటును భర్తీ చేశారు. నేడు గూగుల్ సెర్చ్ నుంచి వర్క్‌స్పేస్ వరకు ప్రతిచోటా ఏఐ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. పిచాయ్ వ్యక్తిగత సంపద కూడా ఆయన కెరీర్‌తో పాటే భారీగా వృద్ధి చెందింది. సీఈఓగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన సుమారు రూ.5,000 కోట్లకు పైగా విలువైన షేర్లను విక్రయించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

# చిన్న సినిమాలకు పెద్ద కటౌట్

**మొదటిపేజీ తరువాయి**

ప్రవేశపెట్టిన ఈ పురస్కారాలు, గతేడాది మాదిరిగానే ఈసారి కూడా చిన్న సినిమాల సత్తాను చాటిచెప్పాయి. ఆడంబరాలకు పోకుండా మట్టి వాసన వెదజల్లే కథలకు, సామాన్యుడి జీవితాన్ని తెరపై ఆవిష్కరించిన దర్శక నిర్మాతలకు పట్టం కట్టడం ద్వారా ఈ అవార్డుల పట్ల చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గౌరవం పెరిగింది. ముఖ్యంగా 2025 సంవత్సరానికి గానూ ప్రకటించిన జాబితాలో తెలంగాణ సంస్కృతి, ఇక్కడి జీవనశైలి ప్రతిబింబించే చిత్రాలకే సింహభాగం దక్కడం విశేషం. రాజు వెడ్స్ రాంబాయి, దండోరా, ప్రీ వెడ్డింగ్ షో వంటి సినిమాలు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రభుత్వ పురస్కారాలను కూడా గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించాయి. కమర్షియల్ సూత్రాలకు లొంగకుండా, కథా బలమే ప్రాతిపదికగా అవార్డులను ఎంపిక చేయడం వల్ల నిజమైన ప్రతిభకు గుర్తింపు దక్కిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లిటిల్ హార్ట్స్ మరియు కోర్ట్ వంటి వైవిధ్యమైన చిత్రాలు కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకుని తమ ఉనికిని చాటుకున్నాయి.




రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సినీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అవార్డుల ప్రక్రియను వేగవంతం చేసింది. గత ప్రభుత్వాల హయాంలో నిలిచిపోయిన పురస్కారాలను ఒక్కసారిగా క్లియర్ చేయడమే కాకుండా, క్యాలెండర్ ప్రకారం 2025 మార్చి నాటికే విజేతల జాబితాను సిద్ధం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది కేవలం అవార్డుల పంపిణీ మాత్రమే కాకుండా, క్రియేటివ్ ఫీల్డ్‌లో ఉన్న వారికి ప్రభుత్వం ఇస్తున్న భరోసాగా కనిపిస్తోంది. సకాలంలో గుర్తింపు లభించడం వల్ల చిన్న సినిమాల మేకర్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది.

ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలుగు నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కళాకారులను గౌరవించుకోవడం ఒక గొప్ప సంప్రదాయంగా మారుతోంది. కేవలం ఒక వేదికపై సర్టిఫికెట్లు ఇచ్చి పంపేయడం కాకుండా, ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా, తెలంగాణ కళా వైభవానికి ప్రతీకగా నిర్వహించాలని యోచిస్తున్నారు. ఈ వేడుకకు రాష్ట్రంలోని ప్రముఖులతో పాటు సినీ రంగానికి చెందిన పెద్దలందరినీ ఆహ్వానించి, ఒక మెగా ఈవెంట్‌గా మార్చేందుకు సాంస్కృతిక శాఖ కసరత్తు చేస్తోంది.

అయితే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. గతేడాది జరిగిన కార్యక్రమంలో కొందరు అవార్డు గ్రహీతలు గైర్హాజరు కావడంపై తీవ్ర చర్చ నడిచింది. ప్రభుత్వ గౌరవాన్ని ప్రతిబింబించే ఇలాంటి పురస్కారాలను స్వీకరించడానికి రాకపోవడంపై అప్పట్లో అధికార యంత్రాంగం అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని బాధ్యతగా స్వీకరించాలని, సినీ రంగం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోతే అది కళాకారులకే నష్టమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ప్రముఖ నిర్మాత దిల్ రాజు కూడా ఈ విషయంపై గతంలో గొంతు ఎత్తారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అవార్డులను ప్రకటిస్తుంటే, వాటిని తీసుకోవడానికి కూడా సమయం లేదన్నట్లుగా ప్రవర్తించడం సరి కాదని ఆయన ఘాటుగానే స్పందించారు. అవార్డు చిన్నదా పెద్దదా అన్నది ముఖ్యం కాదు, అది మన ప్రతిభకు దక్కిన గౌరవం అని ఆయన గుర్తు చేశారు. అందుకే ఈసారి 100 శాతం హాజరు ఉండాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. విజేతలుగా నిలిచిన ప్రతి ఒక్కరూ ఈ గౌరవాన్ని స్వీకరించి, రాష్ట్ర స్థాయి పురస్కారాల విలువను పెంచాలని పెద్దలు కోరుతున్నారు.

గద్దర్ అవార్డుల ప్రధాన ఉద్దేశ్యం కేవలం వినోదాన్ని అందించే సినిమాలను గుర్తించడం మాత్రమే కాదు, సామాజిక చైతన్యాన్ని రగిలించే కళాకారులను ప్రోత్సహించడం కూడా. గద్దర్ తన జీవితాంతం ప్రజా సమస్యలపై ఎలాగైతే పోరాడారో, అదే స్ఫూర్తితో తీసిన చిత్రాలకు ఈ అవార్డుల ద్వారా ప్రాణం పోస్తున్నారు. చిన్న సినిమాల్లోని సహజత్వం, ఆ కథల్లోని నిజాయితీ ఈ అవార్డుల కమిటీని అమితంగా ఆకట్టుకున్నాయి. పెద్ద హీరోల చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించినా, అవార్డుల రేసులో మాత్రం చిన్న చిత్రాలే పైచేయి సాధించడం తెలంగాణ సినిమా మారుతున్న దిశకు సంకేతం. ఈ పరిణామం వల్ల భవిష్యత్తులో మరింత మంది యువ దర్శకులు కొత్త తరహా కథలతో ముందుకు వచ్చే అవకాశం ఉంది. కమర్షియల్ ఎలిమెంట్స్ లేకపోయినా, కథలో బలం ఉంటే ప్రభుత్వమే గుర్తించి గౌరవిస్తుందనే నమ్మకం వారిలో కలిగింది. ముఖ్యంగా తెలంగాణ మాండలికం, ఇక్కడి పండగలు, పద్ధతులను వెండితెరపై ఆవిష్కరిస్తున్న చిత్రాలకు ప్రభుత్వం ఇస్తున్న ఈ మద్దతు ఎంతో కీలకం. గ్రామీణ నేపథ్యం ఉన్న చిత్రాలకు గ్లోబల్ స్థాయిలో గుర్తింపు వస్తున్న తరుణంలో, స్థానికంగా దక్కే ఈ ప్రోత్సాహం సినిమా రంగానికి కొత్త ఊపిరి పోస్తోంది.

మార్చి నెలలోనే అవార్డుల ప్రకటన పూర్తి కావడంతో సినిమా పరిశ్రమలో ఇప్పుడంతా ఉగాది వేడుకల గురించే చర్చ జరుగుతోంది. ఎంపికైన చిత్రాల బృందాలు ఇప్పటికే సంబరాలు మొదలుపెట్టాయి. పెద్ద సినిమాలు మాత్రమే కాదు, నాణ్యమైన కంటెంట్ ఉన్న ఏ సినిమాకైనా ప్రభుత్వం అండగా ఉంటుందనే సందేశం ఈ అవార్డుల ద్వారా బలంగా వెళ్లింది. ఈ పారదర్శకత మరియు శీఘ్రగతిన తీసుకున్న నిర్ణయాలు రేవంత్ రెడ్డి సర్కారుపై సినీ వర్గాల్లో సానుకూలతను పెంచాయి. మొత్తానికి 2025 గద్దర్ అవార్డులు తెలంగాణ సినిమా అస్తిత్వాన్ని చాటుతూ, చిన్న సినిమాల విజయకేతనాన్ని ఎగురవేశాయి. ఉగాది వేదికపై ఈ కళాకారులందరూ ఒక్కచోట చేరి తమ సత్తాను చాటుకోబోతున్నారు. రాని వారిపై విమర్శలు వచ్చే అవకాశం లేకుండా, ప్రతి ఒక్కరూ ఈ వేడుకను తమ సొంత వేడుకగా భావించి విజయవంతం చేయాలని ప్రభుత్వం ఆశిస్తోంది. ఇది కేవలం ఒక అవార్డుల కార్యక్రమం కాదు, తెలంగాణ ఆత్మగౌరవానికి మరియు కళా హృదయానికి పట్టే నీరాజనం.

# మీడియా ప్రజలకు – ప్రభుత్వాలకు మధ్య వారధిగా పని చేయాలి

**సిపిఐ నేత ఆందోజు రవీంద్ర చారి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

ప్రజాస్వామ్యంలో శాసనసభ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థలతో పాటు మీడియా కూడా అత్యంత ప్రాముఖ్యత కలిగిన వ్యవస్థ అని, అది ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పని చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. రావి నారాయణ రెడ్డి భూ పోరాట కేంద్రానికి సంబంధించిన సోషల్ మీడియా ఆక్టివిస్ట్‌ల సమావేశం శనివారం ఆర్ఎన్ఆర్ కాలనీ-2లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా భావించే మీడియా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ దృష్టికి



తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వాలు లేదా రాజకీయ పార్టీలకు అనుకూలంగా సొంత పత్రికల మాదిరిగా వ్యవహరించకుండా నిష్పక్షపాతంగా వాస్తవాలను వెల్లడించాలని కోరారు. భూ పోరాట కేంద్రంలో వేలాది మంది ప్రజలు చిన్న పిల్లలతో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితులను మీడియా ప్రత్యక్షంగా పరిశీలించి నిజమైన సమాచారాన్ని ప్రజలకు, ప్రభుత్వానికి చేరేలా చూడాలని అన్నారు. భూ పోరాటం గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుత కాలంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా ప్రభావం కూడా ఎంతో పెరిగిందని, అందులోని చెడు అంశాలను పక్కనబెట్టి మంచి విషయాలను స్వీకరించి ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాలని సూచించారు. ఇక్కడ జరుగుతున్న భూ పోరాటం గురించి దేశవ్యాప్తంగా తెలిసేలా సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మర్రి శ్రీమాన్ సోషల్ మీడియాకు సంబంధించిన నైపుణ్యాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం భూ పోరాట కేంద్రానికి ప్రత్యేక సోషల్ మీడియా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా భూక్యా వినోద్ నాయక్, కోకన్వీనర్లుగా అనిల్, అశోక్ యాదవ్‌లతో పాటు మొత్తం 20 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మధు, యాదగిరి, పేరాల గోపి, వీరేష్, షాలిని, నీలా, రేణుక, లలిత, చంటి, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులకు బిగ్ రిలీఫ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశవ్యాప్తంగా సామాన్యుడిని పట్టిపీడిస్తున్న ఇంధన ధరల సెగపై కేంద్ర ప్రభుత్వం ఒక తీపి కబురును మోసుకొచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఇప్పుడప్పుడే లేదని శనివారం అధికారిక వర్గాలు స్పష్టం చేయడంతో వాహనదారులకు పెద్ద ఊరట లభించినట్లయింది. గడిచిన కొద్ది రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న ఒడిదుడుకుల నేపథ్యంలో దేశీయంగా ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతాయని సాగిన ప్రచారానికి ప్రభుత్వం ఒక్కసారిగా తెరదించింది. ప్రస్తుతం దేశంలో పెట్రో ఉత్పత్తుల నిల్వలు గణనీయంగా మెరుగుపడటంతో పాటు సరఫరా వ్యవస్థలో స్థిరత్వం ఏర్పడిందని, దీనివల్ల ధరలను పెంచాల్సిన అవసరం లేదని కేంద్రం తన విశ్లేషణలో వెల్లడించింది. ధరల పెంపుపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న ఆరోపణలు నిరాధారమని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని ప్రభుత్వం పేర్కొంది. ధరల స్థిరత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఇంధన భద్రత విషయంలో దేశం ఎప్పుడూ లేనంత పటిష్టంగా ఉందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ముందస్తు ప్రణాళికలు, అంతర్జాతీయ మార్కెట్ విశ్లేషణల వల్ల దేశీయ వినియోగదారులపై అదనపు భారం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వారు వివరించారు. ఈ నిర్ణయం మధ్యతరగతి ప్రజలకు, రవాణా రంగానికి ఎంతో మేలు చేకూర్చే అంశం. అయితే, ఈ ఉపశమనం కేవలం వాహన ఇంధనాలైన పెట్రోల్, డీజిల్‌కు మాత్రమే పరిమితం కావడం గమనార్హం. గృహిణులు, సామాన్య ప్రజలు ఎక్కువగా ఉపయోగించే ఎల్‌పీజీ అంటే వంటగ్యాస్ విషయంలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వంటగ్యాస్ ధరలపై ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వకపోగా, ధరల పెరుగుదల ధోరణిని పరోక్షంగా అంగీకరించింది. గత పన్నెండేళ్ల కాలంలో గ్యాస్ సిలిండర్ ధర సుమారు 110 రూపాయల మేర పెరిగిందని అధికారులు గుర్తు చేశారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, వంటగ్యాస్ ధరల విషయంలో మాత్రం మార్కెట్ ఒడిదుడుకులు అలాగే కొనసాగే అవకాశం కనిపిస్తోంది.



వంటగ్యాస్ సరఫరాను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, ఉత్పత్తిని క్రమబద్ధీకరించడం ద్వారా కొరత లేకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది. సరఫరా గొలుసులో ఉన్న అడ్డంకులను తొలగించి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సకాలంలో సిలిండర్లను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ధరల విషయంలో వినియోగదారులకు ఇబ్బందులు ఉన్నప్పటికీ, కనీసం సకాలంలో సరఫరా జరిగేలా చూడటం ద్వారా వారి ఇబ్బందులను కొంత మేర తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై సంబంధిత చమురు సంస్థలకు కూడా ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

ముడి చమురు దిగుమతుల విషయంలో భారత్ తన వ్యూహాన్ని సమూలంగా మార్చుకుంది. గతంలో చమురు సరఫరా కోసం కేవలం ఒకే రకమైన మార్గాలపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఏర్పడినప్పుడు దేశంలో ధరలు అదుపు తప్పేవి. ముఖ్యంగా ప్రపంచ చమురు వ్యాపారంలో కీలకమైన 'హోర్ముజ్ జలసంధి' వద్ద తలెత్తే రాజకీయ సమస్యలు భారత ఇంధన మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేసేవి. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన కేంద్ర ప్రభుత్వం, పశ్చిమాసియా దేశాలతో సత్సంబంధాలను కొనసాగిస్తూనే, ప్రత్యామ్నాయ సురక్షిత మార్గాలను అన్వేషించింది. ఇది భారతదేశ ఇంధన భద్రతను ఒక సరికొత్త స్థాయికి తీసుకువెళ్ళింది.

ప్రస్తుతం భారత్ తన చమురు దిగుమతులను 60 శాతం నుండి 70 శాతానికి పెంచుకుంది, అది కూడా సురక్షితమైన, నమ్మదగిన మార్గాల ద్వారా. గతంలో హోర్ముజ్ జలసంధిపై ఉన్న అధిక ఆధారపడటాన్ని తగ్గించడం వల్ల, ఆ ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నా లేదా రాజకీయ అస్థిరత ఏర్పడినా భారత ఇంధన సరఫరాకు ఎటువంటి విఘాతం కలగకుండా జాగ్రత్త పడింది. ఈ వ్యూహాత్మక మార్పు వల్ల చమురు నిల్వలను ముందస్తుగా సమకూర్చుకోవడం సులభమైంది. దీని ఫలితంగానే అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించే అవకాశం ప్రభుత్వానికి లభించింది.

తాజా సమాచారం ప్రకారం, సమస్యాత్మకమైన హోర్ముజ్ మార్గంలో కూడా రవాణా పునరుద్ధరణ జరగడంతో ఇంధన సరఫరా వ్యవస్థ పూర్తిస్థాయిలో గాడిలో పడింది. సరుకు రవాణా నౌకల రాకపోకలు పెరగడం వల్ల ముడి చమురు నిల్వలు ఆశించిన మేర భారత్‌కు చేరుతున్నాయి. ప్రభుత్వం ప్రతిరోజూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఎక్కడైనా సరఫరాలో అంతరాయం కలిగితే తక్షణమే స్పందించేందుకు వీలుగా చమురు శాఖ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. సరఫరా పెరగడంతో పాటు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవడం వల్ల దేశంలో ఇంధన సంక్షోభం వచ్చే అవకాశమే లేదని కేంద్రం ధీమా వ్యక్తం చేస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు చమురు ధరలపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భారత్ తన దేశీయ అవసరాలకు తగ్గట్లుగా ముందస్తు ఒప్పందాలు చేసుకుంది. రష్యా వంటి దేశాల నుండి తక్కువ ధరకు చమురును దిగుమతి చేసుకోవడం కూడా ధరల స్థిరత్వానికి ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యూహం వల్ల ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా, సామాన్యుడి జేబుకు చిల్లు పడకుండా చూడగలిగారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, రవాణా రంగం వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఇంధన ధరల స్థిరత్వం అనేది దేశ ఆర్థిక వృద్ధికి వెన్నెముక వంటిదని ప్రభుత్వం గుర్తించింది.

ఇంధన ధరల అంశం ఎప్పుడూ రాజకీయంగా చర్చనీయాంశంగానే ఉంటుంది. అయితే ఈసారి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాత్రం వినియోగదారులకు మానసిక ప్రశాంతతను ఇస్తోంది. పండుగ సీజన్ సమీపిస్తున్న వేళ ధరలు పెరుగుతాయని భయపడిన వారికి ఈ ప్రకటన పెద్ద ఉపశమనం. పెట్రోల్ రేట్లు పెరగకపోవడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా అదుపులో ఉండే అవకాశం ఉంది. రవాణా ఖర్చులు పెరగకపోతే, మార్కెట్లో కూరగాయలు, ఇతర వస్తువుల ధరలు స్థిరంగా ఉంటాయి. ఇది అంతిమంగా సామాన్యుడి జీవన ప్రమాణాలను కాపాడుతుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరల విషయంలో సామాన్యుడికి మేలు జరిగినా, వంటగ్యాస్ ధరల సెగ మాత్రం ఇంకా చల్లారలేదు. భవిష్యత్తులో ఎల్‌పీజీ ధరలను కూడా తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నందున, రాబోయే రోజుల్లో మరిన్ని సానుకూల నిర్ణయాలు వచ్చే అవకాశం ఉందని ఆశించవచ్చు. అంతర్జాతీయ మార్కెట్లో పరిస్థితులు అనుకూలిస్తే, ఇంధన ధరల్లో మరింత తగ్గుదల కూడా సాధ్యమేనని అధికారుల మాటలను బట్టి అర్థమవుతోంది.

# కర్ణుడు కాదు.. కుంభకర్ణుడు

**మొదటిపేజీ తరువాయి**

ఆయన లక్షణాలన్నీ కుంభకర్ణుడిని పోలి ఉన్నాయని ఎద్దేవా చేశారు. పురాణాల్లో కర్ణుడు మాట తప్పని వాడని, అడిగితే తన కవచ కుండలాలను సైతం దానం చేసిన గొప్ప త్యాగమూర్తి అని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం పేదల పొట్ట కొట్టే వ్యక్తి అని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలి అత్యంత క్రూరంగా ఉందని హరీశ్ రావు మండిపడ్డారు. కర్ణుడి ఉదారత రేవంత్‌లో ఇంచు కూడా లేదని, కనీసం రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధు నిధులను కూడా ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. తెలంగాణ రైతాంగం కష్టాల్లో ఉంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం, సాకులు వెతుకుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఒకవైపు రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తుంటే, మరోవైపు కేసీఆర్ హయాంలో పండుగలా సాగిన వ్యవసాయాన్ని రేవంత్ రెడ్డి విధ్వంసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ఇప్పుడు చీకట్లు రాజ్యమేలుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఎటు పోయాయని హరీశ్ రావు నిలదీశారు. ఎన్నికల వేళ ప్రజలకు ఆకాశమే హద్దుగా హామీలు గుప్పించిన రేవంత్ రెడ్డి, పగ్గాలు చేపట్టిన తర్వాత ప్రజలను విస్మరించారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ విషయంలోనూ ప్రభుత్వం మోసం చేసిందని, అర్హులైన వేలాది మందికి నేటికీ లబ్ధి చేకూరలేదని అన్నారు. అభివృద్ధి చేయడం చేతకాక, ప్రజల దృష్టి మరల్చడానికి కేసీఆర్ మీద, బీఆర్ఎస్ ప్రభుత్వం మీద నిందలు వేయడమే రేవంత్ రెడ్డి ప్రధాన అజెండాగా మారిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.



రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న పాలన కేవలం విధ్వంసానికే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని హరీశ్ రావు విమర్శించారు. హైడ్రా పేరుతో, మూసీ సుందరీకరణ నెపంతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మేలు చేయడానికే ఈ విధ్వంసం సృష్టిస్తున్నారని, పేదల కన్నీళ్లు ఈ ప్రభుత్వానికి శాపంగా మారుతాయని హెచ్చరించారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో చెరువులు నింపితే, రేవంత్ రెడ్డి మాత్రం చెరువుల పేరుతో గూడు లేని వారిని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డిని కుంభకర్ణుడితో పోల్చడం వెనుక బలమైన కారణం ఉందని హరీశ్ రావు వివరించారు. కుంభకర్ణుడు ఎలాగైతే దీర్ఘ నిద్రలో ఉండి సమయం వచ్చినప్పుడు మేల్కొంటాడో, రేవంత్ కూడా ఎన్నికలు ఉన్నప్పుడే హడావిడి చేస్తారని విమర్శించారు. ఎన్నికలు ముగియగానే మళ్ళీ ప్రజా సమస్యలపై మౌనం వహిస్తారని ఎద్దేవా చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుల అకౌంట్లలో రైతుబంధు వేసిందని, కానీ నేడు ఎలాంటి విపత్తు లేకున్నా రైతులను రోడ్ల మీదకు తెచ్చిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రికి విమర్శలు చేయడంలో ఉన్న ఉత్సాహం పాలనపై లేదని హరీశ్ రావు అన్నారు. అభివృద్ధి అంటే ఫ్లైఓవర్లు, ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు అని కేసీఆర్ నిరూపించారని, కానీ నేడు కాంగ్రెస్ హయాంలో జరుగుతున్నది అంతా కేవలం ప్రచార ఆర్భాటమేనని కొట్టిపారేశారు. పదేళ్ల కిందటి తెలంగాణకు, నేటి తెలంగాణకు మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా ఎత్తివేస్తూ, పేదల పొట్ట కొట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ పనిచేస్తోందని, ఇదా మీరు చెప్పిన ప్రజాపాలన అని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి గొంతు నొక్కాలని చూస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం ఆపదని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్ల అవినీతికి తెరలేపారని, ఆ నిధులతో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల గోస పోసుకుంటున్న ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ప్రజలు త్వరలోనే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని, చేసే పనులు ప్రజల గుండెల్లో ఉండాలని సూచించారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు భృతి, మహిళలకు నెలకు రూ. 2,500 వంటి వాగ్దానాలు ఏమయ్యాయని నిలదీశారు. ప్రచారాలకు ఖర్చు చేస్తున్న కోట్లాది రూపాయలు ప్రజల సంక్షేమానికి కేటాయించాలని కోరారు. రేవంత్ రెడ్డి తనను తాను గొప్పగా ఊహించుకోవడం మానేసి, క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూడాలని హితవు పలికారు. ప్రజల సొమ్ముతో రియల్ ఎస్టేట్ దందాలు చేయడం మానుకోవాలని గట్టిగా చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, ప్రజల కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉండి పోరాడాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు. అక్రమ కూల్చివేతలకు వ్యతిరేకంగా తాము అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లాలని, కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఎండగట్టాలని కోరారు. చొప్పదండి వేదికగా సాగిన ఈ సమావేశంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని, చేతల్లో శూన్యమని హరీశ్ రావు తన ప్రసంగాన్ని ముగించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి, పేదల కన్నీళ్లపై రాజకీయాలు చేయడం తగదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రజల హక్కుల కోసం ఎక్కడికైనా వెళ్తామని ప్రకటించారు. ఈ విమర్శలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి.

# 'ఎపిక్ ఫ్యూరీ'తో దద్దరిల్లుతున్న టెహ్రాన్!

- **ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు.. 8వ రోజుకు చేరిన యుద్ధం**
- **'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో 3 వేల లక్ష్యాలు ధ్వంసం.. ఇరాన్ నావికాదళం క్లీన్ స్వీప్**
- **లెబనాన్‌పై బాంబుల వర్షం.. ఇజ్రాయెల్ దాడుల్లో 41 మంది దుర్మరణం**
- **దుబాయ్ విమానాశ్రయం వద్ద కూలిన క్షిపణి శిథిలాలు.. గగనతలంలో టెన్షన్**
- **భారత పౌరులకు ఖతార్ ఎంబసీ అడ్వైజరీ.. విమానాలు నడుపుతున్న ఎయిరిండియా**
- **తాను ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ ప్రెసిడెంట్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**

**విశాలభారతి, అంతర్జాతీయం:**



పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుని ప్రాంతమంతా రణక్షేత్రాన్ని తలపిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా చేపట్టిన సైనిక చర్య ఎనిమిదో రోజుకు చేరుకోవడంతో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. శనివారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయెల్ వాయుసేన విస్తృత దాడులకు తెగబడింది. కేవలం ఇరాన్ సరిహద్దులకే పరిమితం కాకుండా, లెబనాన్ రాజధాని బీరుట్‌తో పాటు పలు నగరాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల ఉధృతి చూస్తుంటే ఈ ప్రాంతంలో శాంతి పునరుద్ధరణ ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. అగ్రరాజ్యం అమెరికా అండతో ఇజ్రాయెల్ చేస్తున్న ఈ దాడులు ఇరాన్ రక్షణ వ్యవస్థను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ ఈ సైనిక చర్యను గట్టిగా సమర్థించుకుంటున్నారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులను ప్రశంసిస్తూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ఇరాన్‌కు చెందిన 42 యుద్ధనౌకలను నామరూపాలు లేకుండా చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్ వైమానిక దళం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, వారి కమ్యూనికేషన్ వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ నాయకత్వం కూడా బలహీనపడిందని, అమెరికా శక్తి సామర్థ్యాలను చూసి ఇప్పుడు ప్రపంచ దేశాలు మునుపటి కంటే ఎక్కువగా గౌరవిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

అదే సమయంలో ట్రంప్ తనదైన శైలిలో పాత పాటను వినిపించారు. తాను గతంలో ఎనిమిది యుద్ధాలను ఆపగలిగానని, అందులో భారత్‌పాకిస్థాన్ మధ్య తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతలు కూడా ఉన్నాయని చెప్పుకొచ్చారు. టారిఫ్‌ల అంశాన్ని ఆయుధంగా చేసుకుని తాను ఆ యుద్ధాన్ని నివారించానని ఆయన గొప్పలు చెప్పుకోవడం ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై చర్చనీయాంశమైంది. ఒకవైపు యుద్ధం కొనసాగుతుండగానే, మరోవైపు తన దౌత్యనీతి వల్ల ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొందని ఆయన చాటి చెప్పే ప్రయత్నం చేశారు. అయితే ప్రస్తుతం పశ్చిమాసియాలో జరుగుతున్న విధ్వంసం మాత్రం భిన్నమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తోంది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు పెను విషాదాన్ని మిగుల్చుతున్నాయి. నబీచిట్ పట్టణం లక్ష్యంగా జరిగిన వైమానిక దాడుల్లో సుమారు 41 మంది ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రి ధ్రువీకరించారు. మరో 40 మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జనావాసాలపై కూడా బాంబులు పడటంతో సామాన్య ప్రజలు ప్రాణభయంతో అల్లాడిపోతున్నారు. ఇజ్రాయెల్ తన లక్ష్యాలను ఛేదించే క్రమంలో పొరుగు దేశాల్లోని ఇరాన్ అనుకూల వర్గాలను కూడా వదిలిపెట్టడం లేదు. ఈ దాడులు అంతకంతకూ విస్తరిస్తుండటంతో అరబ్ దేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

యుద్ధం తీవ్రత దృష్ట్యా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ గల్ఫ్ దేశాలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఇరుగుపొరుగు అరబ్ దేశాలపై దాడులు చేసే ఉద్దేశం ఇరాన్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. వారు తమపై దాడి చేయనంత వరకు ఇరాన్ కూడా వెనక్కి తగ్గుతుందని హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల భద్రత తమకు ముఖ్యమని, ఆ ప్రాంతాలపై ఎలాంటి సైనిక చర్యలు చేపట్టకూడదని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్‌అమెరికా కూటమిని ఎదుర్కోవడంలో ఇరాన్ ఒంటరి పోరాటం చేస్తున్న తరుణంలో ఇతర దేశాల మద్దతు కోల్పోకుండా ఉండేందుకే అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. యుద్ధం ప్రభావం పర్యాటక, రవాణా కేంద్రమైన దుబాయ్‌పై కూడా పడింది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో భారీ శబ్దాలతో క్షిపణి శిథిలాలు పడటంతో ప్రయాణికులు భీతిల్లారు. విమానాశ్రయ పరిసరాల్లో దట్టమైన పొగ కమ్ముకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గగనతలం సురక్షితం కాకపోవడంతో ల్యాండ్ కావాల్సిన విమానాలు గంటల తరబడి గాల్లోనే చక్కర్లు కొట్టాయి. ఫ్లైట్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఒకటైన దుబాయ్‌లో ఇలాంటి పరిస్థితి తలెత్తడం అంతర్జాతీయ విమానయాన రంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.

అమెరికా సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' అత్యంత భీకరంగా కొనసాగుతోంది. కేవలం వారం రోజుల్లోనే ఇరాన్ భూభాగంలోని సుమారు 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రాలు, చమురు నిల్వలు, సైనిక స్థావరాలను ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరుగుతున్నాయి. అత్యాధునిక డ్రోన్లు, స్టీల్త్ బాంబర్లతో అమెరికా దళాలు ఇరాన్ రక్షణ వ్యవస్థను మట్టికరిపిస్తున్నాయి. ఇంత పెద్ద ఎత్తున దాడులు జరగడం ఇరాన్ చరిత్రలో ఇది ఒక చీకటి అధ్యాయంగా మారుతోంది. అమెరికా దాడులకు ప్రతిచర్యగా ఇరాన్ తన 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్' 23వ దశను ప్రారంభించింది. టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్రయంపై జరిగిన భారీ దాడులకు ప్రతీకారంగా అమెరికా స్థావరాలపై దాడులు చేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ హెచ్చరించారు. అమెరికన్ సంస్థలు, సైనిక కేంద్రాలే తమ తదుపరి లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై దాడుల్లో అమెరికా AI పవర్‌ప్లే!

**విశాలభారతి, అంతర్జాతీయం:**



ఆధునిక యుద్ధ తంత్రం ఇప్పుడు తుపాకీ గొట్టం నుంచి కాదు, కంప్యూటర్ అల్గారిథమ్స్ నుంచి పుడుతోంది. ఇరాన్‌పై ఇటీవల జరిగిన భారీ దాడులు ప్రపంచానికి ఒక కొత్త రకమైన యుద్ధాన్ని పరిచయం చేశాయి. ఇక్కడ కేవలం బాంబుల మోత మాత్రమే వినిపించలేదు, తెర వెనుక వేల సంఖ్యలో డేటా పాయింట్లను విశ్లేషించిన కృత్రిమ మేధస్సు ప్రతాపం కనిపించింది. అమెరికా సైన్యం తన అమ్ములపొదిలోని అత్యంత శక్తివంతమైన ఏఐ ఆయుధాలను ప్రయోగించి, కేవలం 24 గంటల వ్యవధిలోనే 1,000 లక్ష్యాలను గుర్తించిందంటే అది సామాన్యమైన విషయం కాదు. సాంకేతికత తోడైతే విధ్వంసం ఎంత వేగంగా, ఎంత కచ్చితత్వంతో ఉంటుందో ఈ ఆపరేషన్ నిరూపించింది. ఈ భారీ ఆపరేషన్‌లో కీలక భూమిక పోషించింది 'మావెన్ స్మార్ట్ సిస్టమ్'. అమెరికాకు చెందిన ప్రముఖ టెక్ సంస్థ పలాంటిర్ టెక్నాలజీస్ రూపొందించిన ఈ వ్యవస్థను సైన్యానికి ఒక 'డేటా బ్రెయిన్'గా అభివర్ణించవచ్చు. యుద్ధ క్షేత్రంలో నిరంతరం తిరుగుతున్న ఉపగ్రహాలు, నిఘా డ్రోన్ల ద్వారా వచ్చే లక్షలాది ఫోటోలు, వీడియోలను మనుషులు విశ్లేషించాలంటే కొన్ని వారాల సమయం పడుతుంది. కానీ మావెన్ ఆ పనిని సెకన్ల వ్యవధిలోనే పూర్తి చేసి, శత్రువుల నక్కిన చోటల్లా వెతికి పట్టుకుంటుంది. వేల కొద్దీ చిత్రాలను వడపోసి, అందులో సాధారణ భవనాలకు, శత్రువుల ఆయుధ డిపోలకు మధ్య ఉన్న తేడాను ఇట్టే పసిగట్టి అధికారులకు నివేదిస్తుంది.

కేవలం లక్ష్యాలను గుర్తించడమే కాకుండా, వాటిలో వేటిపై ముందుగా దాడి చేయాలో కూడా ఈ వ్యవస్థ నిర్ణయిస్తుంది. దీనినే 'టార్గెట్ ప్రయారిటైజేషన్' అని పిలుస్తారు. దీనివల్ల సైనిక అధికారులు గందరగోళం లేకుండా అత్యంత కీలకమైన స్థావరాలను ముందుగా ధ్వంసం చేసే అవకాశం దక్కింది. ఫలితంగా కేవలం 12 గంటల్లోనే సుమారు 900 క్షిపణులను అత్యంత కచ్చితత్వంతో ప్రయోగించడం సాధ్యమైంది. మానవ మేధస్సుకు అందని వేగాన్ని ఏఐ ఇక్కడ అందిస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే, యుద్ధ విమానం పైలట్ కంటే ముందుగా డేటా అనలిస్ట్ యుద్ధాన్ని గెలిపించే పరిస్థితి నేడు కనిపిస్తోంది.

ఈ ఆపరేషన్‌లో ఆంత్రోపిక్ సంస్థ తయారు చేసిన 'క్లాడ్' ఏఐ మోడల్ కూడా అద్భుతమైన పనితీరును కనబరిచింది. సాధారణంగా యుద్ధం జరుగుతున్నప్పుడు నిఘా సమాచారం వరదలా వస్తుంటుంది. ఆ సమాచారాన్ని చదివి, ఏ ప్రాంతం యుద్ధ పరంగా ఎంత ముఖ్యమో ఒక వరుస క్రమంలో పెట్టడం క్లాడ్ పని. ఇది కేవలం సమాచారాన్ని విశ్లేషించడమే కాకుండా, దాడి జరిగిన తర్వాత ఎంత నష్టం జరిగింది అనే 'బ్యాటిల్ డ్యామేజ్ అసెస్‌మెంట్'ను కూడా తక్షణమే అందిస్తుంది. ఒకవేళ ఆశించిన ఫలితం రాకపోతే, తదుపరి ప్రణాళికను ఎలా మార్చుకోవాలో కూడా కమాండర్లకు వేగంగా వివరిస్తూ యుద్ధ నిర్వహణను సులభతరం చేస్తోంది.

యుద్ధంలో వేగం అనేది గెలుపోటములను నిర్ణయించే కీలకమైన అంశం. ఒకప్పుడు శత్రువు కదలికలను గుర్తించి, దళాలను మోహరించడానికి రోజులు పట్టేది. కానీ ఇప్పుడు ఏఐ పుణ్యమా అని ఆ సమయం నిమిషాలకు పడిపోయింది. లక్షల కొద్దీ డేటా పాయింట్లను విశ్లేషించి, క్షణాల్లో నిర్ణయాలు తీసుకోవడంలో మనుషుల కంటే ఏఐ ఎంతో ముందుంటోంది. 2025 నాటికి సుమారు 20 వేల మంది అమెరికా సైనికులు ఏఐ వ్యవస్థలను వాడుతున్నారంటే, యుద్ధ రంగంలో సాంకేతికత ఏ స్థాయిలో పాతుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇది కేవలం ఆరంభం మాత్రమే, భవిష్యత్తులో యుద్ధం అంటే కేవలం బలగాల ప్రదర్శన కాదు, అది ఒక డేటా యుద్ధంగా మారబోతోంది.

ట్యాంకులు, యుద్ధ విమానాలు, క్షిపణుల కంటే డేటాను విశ్లేషించే సాఫ్ట్‌వేర్లే ఇప్పుడు అత్యంత శక్తివంతమైన ఆయుధాలుగా మారుతున్నాయి. సాధారణంగా యుద్ధాల్లో పౌర నష్టం జరగకుండా చూడటం సవాలుగా ఉంటుంది. కానీ ఏఐ వాడకం వల్ల అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించడం సాధ్యమవుతోంది, తద్వారా అనవసర ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఇదే సమయంలో యుద్ధ నిర్ణయాలను యంత్రాలకు వదిలేయడంపై ప్రపంచవ్యాప్తంగా నైతిక చర్చలు కూడా మొదలయ్యాయి. నిర్ణయాధికారం మనిషి చేతుల్లోనే ఉండాలని, ఏఐ కేవలం సహాయకారిగా మాత్రమే ఉండాలని మెజారిటీ మేధావుల అభిప్రాయం. ఇరాన్ అణు పరీక్షల గురించి ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో, అమెరికా ఈ స్థాయిలో ఏఐ టెక్నాలజీని ప్రదర్శించడం శత్రు దేశాలకు ఒక బలమైన హెచ్చరికగా భావించవచ్చు. అత్యాధునిక రక్షణ వ్యవస్థలను కూడా బోల్తా కొట్టించగల సామర్థ్యం ఈ మేధో ఆయుధాలకు ఉందని స్పష్టమైంది. నిఘా సమాచారం సేకరించడం నుంచి దాడి అమలు చేయడం వరకు ప్రతి దశలోనూ కృత్రిమ మేధస్సు తన ముద్రను వేస్తోంది. గతం కంటే భిన్నంగా, ఇప్పుడు యుద్ధం కంప్యూటర్ స్క్రీన్లపై మొదలై శత్రువుల స్థావరాలను నేలమట్టం చేసే వరకు అత్యంత వ్యూహాత్మకంగా సాగుతోంది. నేటి తరం యువతకు ఇది ఒక గేమ్ లాగా అనిపించినా, క్షేత్రస్థాయిలో దీని ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుంది. సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో చూసే టెక్నాలజీ ఇప్పుడు నిజజీవితంలో రణరంగంలోకి ప్రవేశించింది. సమాచారమే శక్తి అని సామెత ఉండగా, ఆ సమాచారాన్ని విశ్లేషించగలిగే ఏఐయే అసలైన మహాశక్తి అని అమెరికా నిరూపించింది. రాబోయే రోజుల్లో ప్రతి దేశం తన రక్షణ బడ్జెట్‌లో ఎక్కువ భాగాన్ని ఈ తరహా టెక్నాలజీలకే కేటాయించే అవకాశం ఉంది.

# వైఎస్సార్‌కేవీపీ.. రేవంత్‌వేం నరేందర్..!

**మొదటిపేజీ తరువాయి**

కారణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయనకున్న సుదీర్ఘ సాన్నిహిత్యమేనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కేవలం రాజకీయ మిత్రుడిగానే కాకుండా, రేవంత్ రెడ్డి కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన వ్యక్తిగా ఆయనకు ఈ ప్రాధాన్యత దక్కిందని భావిస్తున్నారు. ఈ పరిణామం చూస్తుంటే గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి, కేవీపీ రామచంద్రరావుల మధ్య ఉన్న గాఢమైన స్నేహం మరోసారి గుర్తుకు రావడం సహజం. తెలుగు రాజకీయాల్లో స్నేహానికి నిలువుటద్దంగా నిలిచిన జోడీ వైఎస్సార్‌కేవీపీ. మెడికల్ కాలేజీ రోజుల నుంచే వీరి ప్రయాణం మొదలైంది. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు వీరిద్దరూ విడదీయలేని అనుబంధాన్ని కొనసాగించారు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కేవీపీ 'ఆత్మబంధువు'గా వ్యవహరించారు. వైఎస్ హెలికాప్టర్ ప్రమాదంలో అస్తమించినప్పుడు ఆయన కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా కేవీపీ కుంగిపోయారు. రాజశేఖర రెడ్డి తాను అధికారంలో ఉన్నప్పుడు తన మిత్రుడికి తగిన గౌరవం దక్కాలని పట్టుబట్టి మరీ 2008లో కేవీపీని రాజ్యసభకు పంపారు. బహిరంగ సభల్లో ప్రసంగించే అలవాటు లేకపోయినా, కేవీపీ మేధోశక్తిని గుర్తించి ఆయనను పెద్దల సభకు పంపడం వైఎస్సార్ స్నేహశీలతకు నిదర్శనం. ప్రస్తుత తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి వేం నరేందర్ రెడ్డిల బంధం కూడా అచ్చం అలాగే కనిపిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వేం నరేందర్ రెడ్డి 2004లో మహబూబాబాద్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ఓడిపోయినా, నరేందర్ రెడ్డి మాత్రం తన నియోజకవర్గంలో పట్టు నిలుపుకున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యుడిగా వైఎస్ ప్రభుత్వంపై ఆయన చేసిన పోరాటం, ఆయన వాగ్ధాటి అందరినీ ఆకట్టుకుంది. ఆ కాలంలోనే టీడీపీలో ఉన్న రేవంత్ రెడ్డితో ఆయనకు బలమైన స్నేహం ఏర్పడింది. పార్టీలు మారినా, పరిస్థితులు తారుమారైనా వారిద్దరి మధ్య ఉన్న బంధం మాత్రం ఇసుమంతైనా చెదరలేదు.



2009 నియోజకవర్గాల పునర్విభజనలో మహబూబాబాద్ రిజర్వ్ కావడంతో వేం నరేందర్ రెడ్డికి రాజకీయంగా కొంత ఇబ్బంది ఎదురైంది. 2010 ఉప ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నుంచి పోటీ చేసినా ఆయనకు విజయం దక్కలేదు. అయినా సరే రేవంత్ రెడ్డి వెంటే ఉంటూ రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు. 2017లో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆయన వెంట నడిచిన మొదటి వ్యక్తి నరేందర్ రెడ్డి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించగానే, 2024 జనవరిలో వేం నరేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి సలహాదారుగా నియమించుకున్నారు. ఇప్పుడు ఏకంగా రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించి తన స్నేహానికి పట్టం గట్టారు.

ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన వేం నరేందర్ రెడ్డి, ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ తరఫున అత్యున్నత సభకు వెళ్లడం ఒక విశేషం. కాలం ఎంతటి చిత్రమైన మలుపులు తిరుగుతుందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ విధానాలను తూర్పారబట్టిన ఆయన, నేడు అదే పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా దాదాపు ఇదే తరహా ప్రయాణాన్ని సాగించారు. స్వతంత్ర అభ్యర్థిగా ప్రారంభమై, టీడీపీలో రాణించి, ఆపై కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. ఈ ఇద్దరు మిత్రుల రాజకీయ ప్రస్థానం దాదాపు ఒకే తీరుగా సాగడం గమనార్హం.

అయితే వైఎస్సార్ కేవీపీ ద్వయానికి, రేవంత్ వేం ద్వయానికి మధ్య ఒక చిన్న వ్యత్యాసం ఉంది. రాజశేఖర రెడ్డి మరియు కేవీపీ ఇద్దరూ పుట్టుకతోనే కాంగ్రెస్ వాదులు. రాజకీయాల్లో అడుగుపెట్టిన నాటి నుండి చివరి వరకు వారు అదే జెండాను నమ్ముకున్నారు. కానీ రేవంత్, నరేందర్ రెడ్డిలు ఇతర పార్టీల నుంచి వచ్చి కాంగ్రెస్‌లో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. సిద్ధాంతాల పరంగా మార్పులు ఉన్నా, వ్యక్తిగత స్నేహం విషయంలో మాత్రం వీరు పాత తరం నేతలను తలపిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు తనను నమ్మిన వారిని, తన వెంట నడిచిన వారిని సముచిత రీతిలో గౌరవించుకోవాలనే రేవంత్ రెడ్డి నైజం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది.

రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానం కూడా ముఖ్యమంత్రి అభీష్టానికే ప్రాధాన్యత ఇచ్చింది. అభిషేక్ మను సింఘ్వీ వంటి జాతీయ స్థాయి నాయకుడితో పాటు, స్థానిక మిత్రుడికి చోటు కల్పించడం ద్వారా సమతూకం పాటించింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి టీమ్ పడ్డ శ్రమను పార్టీ గుర్తించింది. అందులో భాగంగానే నరేందర్ రెడ్డికి ఈ గౌరవం దక్కిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కేవలం స్నేహమే కాకుండా, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు రేవంత్ వెన్నంటి ఉండి వ్యూహకర్తగా వ్యవహరించడం నరేందర్ రెడ్డికి కలిసొచ్చింది. వేం నరేందర్ రెడ్డి ఎంపికతో వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఇప్పటికే జిల్లా నుంచి పలువురు మంత్రులు ఉన్నప్పటికీ, రాజ్యసభ సభ్యత్వం దక్కడం అదనపు బలంగా మారుతుంది. ముఖ్యమంత్రికి నేరుగా అందుబాటులో ఉండే వ్యక్తి కావడం వల్ల జిల్లా అభివృద్ధి పనులకు కూడా మార్గం సుగమం అవుతుందని అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో పార్టీ వాణిని వినిపించేందుకు సిద్ధమవుతున్న వేం నరేందర్ రెడ్డి, తన అనుభవాన్ని దేశ ప్రయోజనాల కోసం ఎలా ఉపయోగిస్తారో వేచి చూడాలి. చెప్పాలంటే, రాజకీయం అంటే కేవలం అధికార దాహం మాత్రమే కాదు, విలువైన స్నేహాల సమాహారం అని రేవంత్ వేం జంట మరోసారి నిరూపించింది. వైఎస్ కేవీపీల మాదిరిగానే వీరు కూడా ప్రజాసేవలో తమదైన ముద్ర వేయాలని ఆకాంక్షిద్దాం. 2026 నాటి ఈ రాజకీయ పరిణామాలు తెలంగాణ కాంగ్రెస్‌లో సరికొత్త అధ్యాయానికి నాంది పలికాయి. పెద్దల సభలో అడుగు పెట్టబోతున్న ఈ మిత్రద్వయానికి శుభాకాంక్షలు తెలుపుతూ, రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా వారు పనిచేయాలని కోరుకుందాం.

సంపాదకీయం

# బీహార్ ప్రజలకు నితీష్ పాలనా అణిచివేతనా..?

బిహార్ ముఖ్యమంత్రి పీఠం నుంచి నితీశ్ కుమార్ నిష్క్రమణ.. అది తాత్కాలికమే కావచ్చు గాక, కానీ ఆ పరిణామం రాష్ట్ర రాజకీయ యవనికపై పెను ప్రకంపనలనే సృష్టించింది. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయ గమనాన్ని నిర్దేశించే అత్యంత కీలకమైన సామాజిక వర్గాల్లో ఈ మార్పు తీవ్ర ఆందోళనను, అభద్రతా భావాన్ని రేకెత్తించింది. జనతాదళ్ (యు) పార్టీకి ఇన్నాళ్లూ కవచంలా నిలిచిన అత్యంత వెనుకబడిన వర్గాలు, ఇతర వెనుకబడిన తరగతులు, మహాదళితులు నేడు కేవలం అశాంతితోనే లేరు; తమను రాజకీయంగా విస్మరించారనే వేదనతో రగిలిపోతున్నారు.

నితీశ్ కుమార్ రాజకీయ ప్రస్థానాన్ని విశ్లేషిస్తేనే ఈ అసంతృప్తి వెనుక ఉన్న అసలు కారణం అర్థమవుతుంది. గతంలో ఆర్జేడీ సుదీర్ఘ పాలనలో ఈ వెనుకబడిన వర్గాలకు అది కేవలం పరిపాలన మాత్రమే కాదు, ఒక రకమైన అణచివేతగా పరిణమించింది. అప్పట్లో ప్రభుత్వ అధికారం కేవలం ఒకే ఒక్క కుల వర్గానికి కొమ్ముకాస్తూ, మిగిలిన సమాజాలను గాలికి వదిలేసిన దుస్థితి ఉండేది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో నితీశ్ కుమార్ రాక ఈ వర్గాలకు ఒక రాజకీయ విముక్తిలా అనిపించింది. వ్యవస్థలో తమకూ భాగస్వామ్యం ఉంటుందన్న భరోసాను ఆయన కల్పించారు. అందుకే ఇప్పుడు ఆయన రాజకీయంగా తెరమరుగు కావడం ఆయా వర్గాలకు వ్యక్తిగత నష్టంలా కనిపిస్తోంది.

ఇదే తరహా రాజకీయ మనస్తత్వం పొరుగునే ఉన్న ఉత్తరప్రదేశ్‌లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ భారతీయ జనతా పార్టీ అజేయ శక్తిగా ఎదగడానికి ప్రధాన కారణం సమాజ్‌వాదీ పార్టీ హయాంలో తాము నిర్లక్ష్యానికి గురయ్యామని భావించిన వర్గాలే. అభద్రత, అదృశ్యత మరియు వ్యవస్థాగత నిర్లక్ష్యం వంటి అంశాలే బిహార్ తరహాలోనే అక్కడ కూడా బీజేపీకి బలాన్ని చేకూర్చాయి. వారికి ఒక గుర్తింపును ఇవ్వడం ద్వారా బీజేపీ బలపడింది. అయితే, ఇప్పుడు ఆ బంధం ఒత్తిడికి లోనవుతున్నట్లు కనిపిస్తోంది.

బిహార్ నుంచి ఢిల్లీ దాకా వెల్లువెత్తిన నిరసన జ్వాలలు కేవలం వీధి పోరాటాలు మాత్రమే కాదు. అవి పాలకులకు ఒక గట్టి హెచ్చరికను పంపిస్తున్నాయి. ఈ వెనుకబడిన సమాజాలు ఇప్పుడు కేవలం నామమాత్రపు పరిపాలనను మాత్రమే కోరుకోవడం లేదు; తమ అస్తిత్వాన్ని ప్రతిబింబించే, తమ గొంతుకను వినిపించే నాయకత్వాన్ని, స్పష్టమైన రాజకీయ ప్రాతినిధ్యాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఎక్కడో ఉండి తమ ప్రయోజనాలను పర్యవేక్షించే నేత కాకుండా, తమలో ఒకడిగా ఉండే నాయకుడి కోసం అవి ఎదురుచూస్తున్నాయి.

ఈ పరిణామం అటు బీజేపీకి, ఇటు జేడీయూకు పెను సవాలుగా మారింది. కూటమిలో అగ్రభాగస్వామిగా ఉన్న బీజేపీ ఈ పరిణామాలను చూసీచూడనట్లు వదిలేయడానికి వీల్లేదు. అత్యంత విశ్వసనీయమైన ఓటు బ్యాంకు ఆశయాలను గుర్తించడంలో విఫలమైతే, ఆ కూటమి పునాదులు ఒక్కరోజులో కూలిపోకపోవచ్చు కానీ, క్రమంగా బలహీనపడి కోలుకోలేని దెబ్బ తినే ప్రమాదం ఉంది. ఒకవైపు కీలకమైన బ్రాహ్మణ సామాజిక వర్గంలో అసంతృప్తిని చక్కదిద్దుకుంటూనే, మరోవైపు ఈబీసీ-ఓబీసీ-మహాదళిత వర్గాలను కలుపుకుపోవాల్సిన తరుణమిది. రాజకీయాల్లో సమీకరణాలు ఏమాత్రం బెసిగినా ఫలితాలు దారుణంగా ఉంటాయి. అటు బ్రాహ్మణుల విశ్వాసాన్ని, ఇటు అట్టడుగు వర్గాల అండను ఒకేసారి కోల్పోతే ఏ రాజకీయ శక్తికైనా మనుగడ కష్టమే. బిహార్ రాజకీయాలు ఇప్పుడు ఇదే ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. మరి పాలకులు ఆ హెచ్చరికలను గమనిస్తారో లేదో కాలమే నిర్ణయించాలి.



టీ అవినాష్ డైరెక్టర్ ఐ అండ్ పీఆర్, ఏవీటీ గ్లోబల్, న్యూఢిల్లీ

# ఉద్యోగ మేళా – గ్రామీణ యువతకు మంచి అవకాశం

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా గ్రామీణ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్డిఏ) - ఈజీఎంఎం వై ఆధ్వర్యంలో ప్రత్యేక ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదన రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళా ద్వారా ప్రముఖ ప్రైవేట్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్, జహీరాబాద్ లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ మరియు ఇతర ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు లేదా ఏదైనా ఐటీఐ ట్రేడ్ చేసిన అభ్యర్థులు అర్హులు. వయస్సు 18 నుండి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.12,000 నుండి రూ.14,300 వరకు స్టైపెండ్ లేదా జీతం అందించబడుతుందని తెలిపారు. అదనంగా ప్రతి నెల హాజరు బోనస్‌గా రూ.1,000 ఇవ్వబడుతుందని, సబ్సిడీతో కాంటీన్ సౌకర్యం నెలకు రూ.100 లోపు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అదే విధంగా ఎంపికైన అభ్యర్థులకు ఉచిత రవాణా సౌకర్యం జహీరాబాద్ పట్టణ పరిసర ప్రాంతాల నుండి సంస్థ వరకు కల్పించబడుతుందని, అలాగే యూనిఫాం, టీషర్ట్, షూస్ వంటి అవసరమైన వస్తువులు కూడా ఉచితంగా అందజేయబడతాయని తెలిపారు. ఈ ఉద్యోగ మేళా 2026 మార్చి 13వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు మహబూబాబాద్ పట్టణంలోని రామమందిరం ఎదురుగా, రైల్వే స్టేషన్ పక్కన ఉన్న జిల్లా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించబడుతుంది. ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. కావున అర్హత మరియు ఆసక్తి గల మహబూబాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా లేదా రెజ్యూమే, విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్ ప్రతులతో పాటు నిర్దిష్ట తేదీ మరియు సమయానికి ఉద్యోగ మేళాకు హాజరుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కోరింది. మరిన్ని వివరాల కోసం జి. గణేష్, జాబ్స్ జిల్లా మేనేజర్ ను మొబైల్ నంబర్: 8522054266 లో సంప్రదించవచ్చని తెలిపారు.



# విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**మహబూబాబాద్ , విశాలభారతి:**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం నెల్లికుదురు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న సందర్శించారు. ఈ సందర్శనలో తహసీల్దార్ చందా నరేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్. కుమార్, వైద్యాధికారి డాక్టర్ చైతన్య పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థినుల విద్యా ప్రగతి, వసతి, భోజన సదుపాయాలు, పరిశుభ్రత వంటి అంశాలను వారు సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా మనో వికాసాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని, క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు.



అలాగే మానసిక ఆరోగ్యం, క్రీడలు, వ్యాయామం వంటి అంశాలపై విద్యార్థులకు ప్రతిరోజూ అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల పరిసరాల పరిశుభ్రతను కూడా కచ్చితంగా పాటించాలని, సిబ్బంది కూడా ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. విద్యార్థినులకు ప్రతిరోజూ తాజా, వేడి వేడి మరియు పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాల సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. అలాగే విద్యార్థుల్లో జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి ఆరోగ్య సమస్యల లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని, స్వీయ చికిత్సకు ప్రయత్నించకూడదని అధికారులకు సూచించారు.

# సిద్ధిపేటలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



**సిద్ధిపేట, విశాలభారతి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా సిద్ధిపేట పట్టణంలోని ఎర్ర చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి చెరువు నీటిలో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు తదితర వ్యర్థాలను తొలగించారు. అలాగే చెరువు కట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కమిషనర్ స్వయంగా చీపురు పట్టి చెరువు కట్టపై ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఎండుటాకులను ఊడ్చి చెత్త వాహనంలో వేయడం ద్వారా సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. మున్సిపల్ సిబ్బంది గుంపులుగా ఏర్పడి పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు చెరువు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలు తమ ఇళ్లలో వెలువడే వ్యర్థాలను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి మున్సిపల్ చెత్త వాహనానికి అందజేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. పట్టణంలో చాలా మంది ప్రజలు చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేస్తున్నారని, కొందరు అవగాహన లేమితో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి జరిమానాలు విధించే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మనలో మార్పు వస్తేనే పట్టణంలో మార్పు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, బందారం రాజు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలోని మిలన్ గార్డెన్ వద్ద కమిషనర్ అశ్రిత్ కుమార్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

# పేదోళ్ల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**నారాయణఖేడ్, విశాలభారతి:** పేదోళ్ల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు.శనివారం నారాయణ ఖేడ్ మండలం ర్యాకల్ గ్రామంలో విద్యావతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... పేదల సొంతింటి కలను నెరవేర్చలానే ఉద్దేశంతో ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించాలనే ఉద్దేశ్యంతో ....తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ఎంతో ప్రతిష్టత్మాకంగా ప్రవేశ పెట్టిన ఇదిరమ్మ ఇండ్ల పథకాన్ని పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని అన్నారు.పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యమని అన్నారు,గత బిఅర్ఎస్ ప్రభుత్వం హయాంలో .డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు.గత ప్రభుత్వ 10 ఏండ్ల పాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు.మొదటి విడతలో ఇల్లు మంజూరైన వారు ఇండ్లను నిర్మించుకొని గృహప్రవేశలు చేసుకుంటున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువయ్యే దిశగా ప్రభుత్వం పనిచేస్తుంది

**నారాయణఖేడ్, విశాలభారతి:** ప్రజలకు మరింత చేరువయ్యే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సమావేశం శనివారం నిర్వహించారు.ఈ కార్యమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎంపి తెలిపారు. ఎంపీ ఎమ్మెల్యే మాట్లాడుతూ....ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా ప్రజా పాలన, పట్టణంలోని మౌలిక వసతుల అభివృద్ధి, ప్రతి కుటుంబం వరకు ప్రభుత్వ పథకాలను చేర్చే దిశగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం మన ముందు తీసుకొచ్చిందని అన్నారు. సమస్యలను ప్రత్యక్షంగా విని, తక్షణ పరిష్కారానికి సంబంధించిన ఆదేశాలు అధికారులకు జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజ్, తాగునీరు, విద్యుత్, శానిటేషన్‌తో పాటు విద్య, ఆరోగ్య రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతి వార్డు సమస్యలను వారాలవారీగా గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర నిధులను సక్రమంగా వినియోగించి నారాయణఖేడ్ పట్టణాన్ని అభివృద్ధి పట్టణంగా మలచడానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, మంజూరు కావాల్సిన నిధుల విషయంలో పార్లమెంట్ స్థాయిలో నిరంతర ప్రయత్నాలు కొనసాగిస్తానని భరోసా ఇచ్చారు.అనంతరం మున్సిపల్ శానిటేషన్ వర్కర్లకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాగ్జీవన్, మున్సిపల్ వైస్ చైర్మెన్ దారం శంకర్ సెట్, కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# నల్లబెల్లి రైతు వేదికలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**నల్లబెల్లి, విశాలభారతి:**

వరంగల్ జిల్లా నల్లబెల్లి రైతు వేదికలో శనివారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో నిర్వహించిన మెడికల్ క్యాంపును కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న పౌష్టిక ఆహార పదార్థాలను తీసుకోవాలని, పూర్వకాలంలో పెద్దలు సీజనల్ ఆహారాలను తీసుకుంటూ కష్టపడి పనిచేసేవారని, అదే విధంగా క్రమపద్ధతిలో జీవించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా మాతా-శిశు, కిశోర, వృద్ధుల ఆరోగ్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్, టీబీ, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై ఉచిత పరీక్షలు నిర్వహించి స్పెషలిస్ట్ డాక్టర్లచే చికిత్స అందిస్తున్నామని చెప్పారు.

అలాగే మార్చి 8 నుంచి 14-15 సంవత్సరాల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, వరంగల్ సికేఎం, ఎంజీఎం ఆసుపత్రులు, వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు చెప్పారు. స్థానిక సర్పంచ్ నాగెల్లి జ్యోతి మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, ఆర్డీవో ఉమారాణి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ, జీజీహెచ్ నర్సంపేట డాక్టర్ కిషన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇఫ్తీకర్ అహ్మద్, డాక్టర్ విజయకుమార్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఆచార్య, ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**ములుగు, విశాలభారతి:**

ములుగు జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాలో హైదరాబాద్ కి చెందిన ప్రముఖ సంస్థలు,కంపెనీల వారు జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులకు వివిధ రకాలుగా ఇంటర్వ్యూలు నిర్వహించగా అర్హత సాధించిన వారికి కంపెనీలో విద్య అర్హతకు తగ్గ ఉద్యోగ నియామక పత్రాలను రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా శనివారం సాయంత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు అలాగే జాబ్ మేళాకి వచ్చిన కంపెనీల వారికి అభినందించి ఉద్యోగాలు సాధించిన వారిని మంత్రి సీతక్క అభినందించారు.

# రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణా కార్యక్రమం



**తొర్రూర్, విశాలభారతి:** ఆత్మ మరిపెడ డివిజన్ ఆధ్వర్యంలో తొర్రూర్ మండలం చీకటాయపాలెం గ్రామం మరియు దంతాలపల్లి మండల కేంద్రంలో రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో రైతులకు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాగు పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందే విధానాలు, పంటల సంరక్షణపై నిపుణులు వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, వ్యవసాయంలో కొత్త సాంకేతికతలను ఉపయోగించుకోవడం ద్వారా రైతులు మరింత లాభాలను పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొర్రూర్ మండల వ్యవసాయ అధికారి రామ నరసయ్య, దంతాలపల్లి మండల వ్యవసాయ అధికారి వాహిని రైతులకు పంటల ఎంపిక, ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకుని వాటి పరిష్కారాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు, పలువురు రైతులు పాల్గొని శిక్షణను ఆసక్తిగా వినిపించారు. రైతులు ఈ శిక్షణల ద్వారా వ్యవసాయంలో కొత్త మార్గాలను తెలుసుకునే అవకాశం కలిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# వేసవిలోనూ నిరంతరాయ విద్యుత్

**బాలానగర్‌లో టీజీఎస్‌పీడీసీఎల్ ముందస్తు చర్యలు**



**కూకట్ పల్లి, విశాలభారతి:** భానుడి భగభగలు మొదలవ్వకముందే నగరంలో విద్యుత్ కష్టాలు తీర్చేందుకు టీజీఎస్పీడీసీఎల్ నడుం బిగించింది. వేసవిలో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, లోవోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి సారించింది.బాలానగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలకు చెక్ పెట్టేందుకు ఐడీపీఎల్ ఏఈ (ఆపరేషన్స్) మహ్మద్ అక్బర్ నేతృత్వంలోని బృందం ఇటీవల విస్తృత గ్రౌండ్ సర్వే నిర్వహించింది. లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ సాంకేతిక మార్పులు చేపట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు సాగాయి. వేసవిలో ఏసీలు, కూలర్ల వినియోగం పెరగడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడి ఫ్యూజులు పోవడం, వైర్లు తెగిపోవడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. వీటిని నివారించడానికి విద్యుత్ శాఖ 'లోడ్ బైఫురకేషన్' (వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఒకే ఫీడర్‌పై ఉన్న అదనపు భారాన్ని తగ్గించడం, పాత వైరింగ్ స్థానంలో అత్యాధునిక 'బంచ్ కేబుల్స్' ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ అక్బర్ మాట్లాడుతూ వేసవిలో వచ్చే ఈదురు గాలులు, అధిక వేడి వల్ల షార్ట్ సర్క్యూట్లు జరగకుండా ఈ కొత్త కేబులింగ్ వ్యవస్థ రక్షణగా ఉంటుంది. ప్రతి ఇంటికి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును అందించడమే మా ప్రాధాన్యత అని అక్బర్ పేర్కొన్నారు. బాలానగర్ డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న ఈ ఆధునీకరణ పనుల పట్ల స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వోల్టేజ్ హెచ్చుతగ్గులు తగ్గి, విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పాడవకుండా ఉంటాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# పరిశుభ్రమైన పరిసరాలే ప్రజల ఆరోగ్యానికి పునాది

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా అశ్వారావుపేటలో 99 రోజుల కార్యాచరణ ప్రారంభం
- అశ్వారావుపేట మున్సిపాలిటీలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం
- నూతన మున్సిపల్ భవనాన్ని స్వయంగా శుభ్రం చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- పారిశుధ్య కార్మికులను సన్మానించి సేవలకు అభినందనలు




**అశ్వారావుపేట, విశాలభారతి:**

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఆయన అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా నూతన మున్సిపాలిటీ భవనాన్ని ఆయన స్వయంగా శుభ్రం చేసి పారిశుధ్య కార్యక్రమానికి ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి మన ప్రాంతాన్ని పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇటుకల బట్టీలకు డిఆర్ సీసీ రూపే బొగ్గు



**బొగ్గు దొంగలను ప్రోత్సహిస్తున్న ఇటుకల వ్యాపారులు**

- డిఆర్ సి సి పర్యవేక్షకుల కండ్లుగప్పి చోరీలు
- గత కొన్నేళ్లుగా సాగుతున్న దొంగ బొగ్గు వ్యాపార లావాదేవీలు
- బొగ్గులోడుతో ఇటీవల పోలీసులకు పట్టుబడ్డ ఓ ట్రాక్టర్
- ఏజెన్సీలో యదేచ్చగా ఇటుకల వ్యాపారం

**అశ్వాపురం, విశాలభారతి:** మండలంలోని సీ తారామపురం పంచాయతీ, మొండికుంట శివారు పంచాయితీ నెల్లిపాక రెవిన్యూ పరిధిలో ఇటుకల వ్యాపారం నిర్వహిస్తున్న వారు చట్టాలనే సవాల్ చేస్తున్నారు. వారి వ్యాపారం సజావుగా సాగేందుకు అడ్డదారులను సైతం తొక్కుతూ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా వీరాజిల్లేలా చేసుకునేందుకు బాటలు వేసుకుంటున్నారనే వాదనలు లేకపోలేదు. ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కడమే కాకుండా ప్రభుత్వ నిబంధనలకు పాతరేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాన్ని కొనసాగిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు ఇటుకల వ్యాపారు. సంబంధిత శాఖల అధికారులను గుప్పెట్లో పెట్టుకుని అరిసె కుక్కకు ఖండేసి నోరు మూపిస్తున్నట్లు వారి వ్యాపారాలను నిర్వహిస్తున్నారనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. వీరు చేస్తున్న ఇటుకల వ్యాపారానికి అవసరమైన ముడి సరుకులైన మట్టి, కర్ర, బొగ్గు అడ్డదారుల్లో తెచ్చుకునేందుకు వెనకాడడం లేదని పలువురు అంటున్నారు. ఇవన్నీ కూడా సంబంధిత శాఖల అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి.



**ఇందుకు ప్రధానమైన ఉదాహరణ డిఆర్ సిసి బొగ్గే**

సింగరేణి కాలరీస్ లోని కొండాపురం నుండి భారజల కర్మాగారంకు అవసరమైన బొగ్గు నిక్షేపాలను డిఆర్ సీసీ కంపెనీ ద్వారా ఏర్పాటుచేసిన రోప్ వే పై బకెట్ల ద్వారా ప్లాంట్ కు వస్తుంది. అయితే గత కొన్నేళ్ల నుండే కొందరు ట్రాక్టర్ యజమానులు రోప్ పై బొగ్గు బకెట్లు తిరగకుండా ఆగి ఉన్నప్పుడు లోడుతో ఉన్న పెట్టెల కింద ట్రాక్టర్ డొక్కులను ఉంచి చాకచక్యంగా లాకులు తొలగించి అందులో బొగ్గు ట్రాక్టర్లో లోడ్ చేసుకొని ఇటుకల బట్టీలకు అమ్ముతున్నారనేది జగమెరిగిన సత్యం. ఇందుకు సంబంధించి గతంలో ఆ రోప్ వే పరిసర ప్రాంతాలలోని గ్రామాల ట్రాక్టర్ యజమానులపై అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదైన సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. అంతేకాకుండా ఇటీవల కాలంలో కూడా ఈ రోప్ వే ద్వారా వస్తున్న బొగ్గును ట్రాక్టర్ లో తీసుకొస్తున్న ఓ వ్యక్తిని అశ్వాపురం పోలీసులు పట్టుకొని కేసు కూడా నమోదు చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇటుకల బట్టీల నిర్వాహకులతో ఈ అక్రమ బొగ్గు వ్యాపారులకు దశాబ్దాల కాలం నుండి మెరుగైన సంబంధాలే ఉన్నాయని మండల ప్రజలంటున్నారు. ఇంకొక రకంగా చెప్పాలంటే ఇటికల నిర్మాణానికి బట్టీలు కాల్చేందుకు బొగ్గు పాత్ర కీలకంగానే ఉంది. దీంతో సింగరేణి కాలరీస్ నుండి బొగ్గు తెచ్చుకుంటే అదనపు భారంతో పాటు కొంత రిస్కు కూడా చేయాల్సి వస్తుందన్న ఉద్దేశంతో కొందరు ఇటుకుల బట్టిలా నిర్వాహకులు ఇలా డిఆర్ సిసి ద్వారా దొంగిలించిన బొగ్గు, అదేవిధంగా రైల్వే వ్యాగన్ల ద్వారా వెళుతున్న బొగ్గును కూడా కొందరు అక్రమార్కులతో సంబంధాలు కుదుర్చుకొని కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అక్రమ పద్ధతిలో వ్యాపారాలు జరిగినప్పుడు దొరికితే దొంగ లేకపోతే దొర అన్న పందాను ఇటుక బట్టీల వారు కొనసాగించుకుంటూ వెళ్తున్నారని ప్రజలు అంటున్నారు. ఈ క్రమంలోనే అడవి నుండి కర్ర, తుమ్మల చెరువు నుండి మట్టి కూడా తెస్తున్నారని ప్రజలంటున్నారు.

## ఇటుకల వ్యాపారానికి అనుమతులు, కార్మికుల పరిస్థితి ఇక సరేసరి :

ఏజెన్సీలో ఇటికల వ్యాపారం చేసేందుకు కొన్ని ప్రత్యేకమైన అనుమతులు అవసరం ఉన్నప్పటికీ వాటన్నిటికీ చమర గీతం పాడి బట్టీల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారన్నది అక్షర సత్యం అని ప్రజలు అంటున్నారు. సక్రమ మార్గంలో వ్యాపారం చేయాలంటే ఎన్నో ఆటంకాలు ఎదురవుతున్నాయన్న ఉద్దేశంతో వ్యాపారులందరూ సిండికేట్ గా ఏర్పడి ఎవరిని ఎప్పుడు ఎక్కడ ఎలా వశపరచుకోవాలో అన్న నాడిని పట్టుకున్నారు. తద్వారా వారి వ్యాపార కార్యకలాపాలకు అడ్డం వచ్చే వారిని తమదైన స్టైల్ లో నోరుమూపిస్తూ వ్యాపార నిర్వాహనను చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇక కార్మికుల పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. పొరుగునున్న చత్తీస్గడ్, ఒడిస్సా రాష్ట్రాల నుండి గొత్తికోయ గిరిజన సామాజిక వర్గాలకు చెందిన కార్మికులను తీసుకొని వచ్చి వారికి అరకుర వసతులు కల్పించి నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి జీవో రేట్లు ఇవ్వకపోవడంతో పాటు వారికి కల్పించాల్సిన సౌకర్యాలు అరకొర కల్పిస్తూ వారి చమటను కరెన్సీగా మలుచుకొని కోట్లకు పడగలుతున్నారనే వాదనలు లేకపోలేదు. ఇక శ్రమ దోపిడీ ఒక ఎత్తు అయితే వారి వెంట ఈ ఇటుకల తయారీ సీజన్లో వచ్చే కార్మికుల చిన్నారుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతుందని పలు సందర్భాలలో నిర్ధారణకు వచ్చిందని ప్రజలంటున్నారు. బాల్యం భట్టీలలో మగ్గుతూ పలక, బలపం పట్టాల్సిన పసిచేతులు మట్టి పిసుకుతూ తల్లిదండ్రుల బాటలోనే వారి జీవితాలు కూడా ప్రయాణిస్తున్నాయన్నది అక్షర సత్యం. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఇక్కడ పెద్ద ఎత్తున జరుగుతున్న ఇటుకల వ్యాపారం పట్ల శ్రద్ధ పెట్టి కార్మికులకు కల్పిస్తున్న వస్తువులు, చిన్నారులకు విద్య పాటు గర్భిణీలు, బాలింతలకు పొష్టికాహారం కనీస మౌలిక వసతులు కల్పిస్తున్నారా లేదా అన్నది కూడా సంబంధిత శాఖ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సీతారామపురం పంచాయతీలో జరుగుతున్న ఇటుకల తయారీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి కార్మికులకు, వారి పిల్లలకు మేలు చేకూరేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే



**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో దూకుంట్ల నాగమణి - వెంకన్న దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని అధికారికంగా ప్రారంభించారు. అనంతరం గృహప్రవేశ వేడుకలో పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించి, కొత్త ఇంట్లో సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సొంత గృహం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపుతున్నామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పేదల అభివృద్ధికి దోహదపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపాలిటీ చైర్పర్సన్ విశారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ నీలా లచ్చిరాం, 3వ వార్డు కౌన్సిలర్ రాములు నాయక్, 4వ వార్డు కౌన్సిలర్ మెరుగు రాము, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు తాజుద్దీన్, సీనియర్ నాయకులు బోర గంగయ్య, అల్వాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన గుగులోతు రవి నాయక్



**కురవి, విశాలభారతి:** కురవి మండలంలోని నల్లెల గ్రామానికి చెందిన యువ నాయకుడు కాంపెల్లి వేణు - మనీషా ల వివాహం శనివారం ఘనంగా జరిగింది. కందికొండ స్టేజి సమీపంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఈ వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను బిఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్ ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అదే విధంగా నల్లెల గ్రామ సర్పంచ్ రెంటాల కృష్ణ, ఉప సర్పంచ్ కృష్ణమూర్తి, అంబటి కరుణాకర్ తదితరులు కూడా వివాహ వేడుకలో పాల్గొని వధూవరులకు ఆశీస్సులు అందించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎర్జర్ల గ్రామ సర్పంచ్ తల్లి మరణం

- **కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ రామచంద్ర నాయక్**



**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఎర్జర్ల గ్రామ సర్పంచ్ తల్లి మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామ చంద్ర నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి చేరుకొని మృత దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తల్లి కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సర్పంచ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతురాలికి ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సర్పంచ్ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

# ప్రజలు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్లో సీనియర్ నాయకులు సంతు గౌడ్ ఆధ్వర్యంలో ATG ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం (ఫ్రీ ఐ క్యాంపు ) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డివిజన్ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సేవ కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల భాస్కర్, మారు మురళి, గోపాల్ నాయక్, భూషణ్, ప్రభుదాస్, గురుస్వామి, రంజిత్ సింగ్, భరత్, రమేష్ రెడ్డి, కురుమూర్తి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కుంట్లూరు డివిజన్ పరిధిలోని గౌరెల్లి గుట్టపై శ్రీశ్రీశ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం (08032026) ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ తెలపడం జరిగింది. ఉదయం 8 గంటలకు స్వామివారికి అభిషేకం, అనంతరం సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ చైర్మన్,పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమస్త గ్రామ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల నాయకురాళ్లు, యువజన సంఘాల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది. భక్తులు కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ చెంచాల శ్రీనివాస్, డైరెక్టర్లు నిరుడు రాజు, గ్యార దివ్య దాస్, చెట్టిగారి రాజేష్ తదితరులు పాల్గొననున్నారు.



# గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ ముఖ్య సలహాదారులు



**నిజామాబాద్, విశాలభారతి:** బోధన్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో శనివారం బోధనలు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహాదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు 11వ వార్డులో ఏషాల సావిత్రి కుటుంబ సభ్యులు నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశంలో ఆయన పాల్గొన్నారు ఇందిరమ్మ ఇంటికి రిబ్బన్ కట్ చేసి ఇంటిని పరిశీలించారు కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేదల పక్షాన ఉంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మావతి శరత్ రెడ్డి తాసిల్దార్ విటల్ మాజీ కౌన్సిలర్ బొగ్గుల ప్రభాకర్ కాంగ్రెస్ నాయకులు పులి శ్రీనివాస్ వేశాల గంగాధర్ దేశాల సూరి తదితరులు పాల్గొన్నారు..

# మార్కెట్ యార్డ్‌ను పరిశీలించిన ప్రభుత్వ విప్



**డోర్నకల్, విశాలభారతి:** డోర్నకల్ మున్సిపల్ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ యార్డ్‌ను శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, మరియు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరిష్ కలిసి పరిశీలించారు. మార్కెట్ యార్డ్‌లో రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకుని అక్కడి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో రైతులకు అందుతున్న సదుపాయాలు, కూరగాయల విక్రయ విధానం, మార్కెట్ నిర్వహణ విధానాలపై అధికారులతో చర్చించారు. రైతులు తమ పంటలను సులభంగా విక్రయించుకునేలా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో పరిశుభ్రత, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు, వ్యాపారులు మరియు వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్ నిర్వహణ జరగాలని సూచించారు. రైతుల కష్టానికి తగిన ధరలు లభించే విధంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ వ్యాపారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# బంచరాయితండలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులు



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గత నాలుగు రోజుల క్రితం పాడైపోయిన బోరింగ్‌ను మరమ్మతు చేసి తిరిగి వినియోగానికి సిద్ధం చేశారు. దీంతో విద్యార్థులకు తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారమైంది. అదేవిధంగా పాఠశాల ప్రాంగణం మరియు గ్రామపంచాయతీ ఆవరణలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది మరియు కార్మికులు కలిసి పరిసరాలను శుభ్రపరిచి పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించారు. ఈ పనులు బంచరాయితండ సర్పంచ్ అభ్యర్థి కమ్లి పుల్య మరియు ఉప సర్పంచ్ భూక్య కల్పన భరత్ మరియు, గ్రామపంచాయతీ కార్యదర్శి యాకూబ్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ అభివృద్ధి మరియు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మాధవరెడ్డి సేవలు మరువలేనివి

**మోగుదాల పావని రమేష్ గౌడ్**

**చౌటుప్పల్, విశాలభారతి:** దివంగత మాజీమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని చౌటుప్పల్ పురపాలక చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. మాధవరెడ్డి వర్ధంతిని సందర్భంగా చౌటుప్పల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పురపాలక చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడారు..ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి మాధవరెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బడుగు లక్ష్మయ్య, సామిడి రాఘవరెడ్డి,కొసనం రాకేష్ రెడ్డి, ఊడుగు జ్యోతి,పిల్లలమరి మధుసూదన్,ఎండి హను బాయ్,వెలుగ రాజశేఖర్ రెడ్డి,చిన్నగోని అంజయ్య గౌడ్,చామకూర రాజయ్య,బొంగు శీను గౌడ్,సుర్కంటి బాలకృష్ణారెడ్డి, వెంకటేష్,సురేష్,టిడిపి నాయకులు,కార్యకర్తలు, మాధవరెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అందరి భాగస్వామ్యంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**
- **2 కే రన్ లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే, మేయర్**



**నిజామాబాద్, విశాలభారతి:** అందరి భాగస్వామ్యంతో జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నగరంలో 2 కే రన్ నిర్వహించారు. కంటేశ్వర్ బైపాస్ రోడ్డు నుంచి చేపట్టిన ఈ పరుగును కలెక్టర్ ఇలా త్రిపాఠి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, నగర మేయర్ ఉమారాణి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. కంటేశ్వర్ బైపాస్ నుండి ప్రధాన మార్గాల మీదుగా పాత ఆర్డీఓ కార్యాలయం వరకు 2 కే రన్ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతను చాటేలా కార్యక్రమాలు అమలు చేయాలని అధికారులకు సూచించారు. అంకిత భావం, చిత్తశుద్ధితో ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో పాల్గొనే అధికారులు, సిబ్బందిని గుర్తించి ఉత్తమ అవార్డులు అందజేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. వివిధ వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున మేలు చేకూరేలా సమర్థవంతంగా కార్యక్రమాలు అమలు చేయాలని, అందరినీ భాగస్వాములు చేయాలని సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్ది నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు మంచి పేరు తేవాలన్నారు. వైద్య శాఖతో సమన్వయం చేసుకుని మహిళలు అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా, 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నిరోధం కోసం హెచ్.పీ.వీ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్మికులకు ప్రయోజనం చేకూరేలా, వారి న్యాయమైన కోర్కెలు పరిష్కారం అయ్యేలా తనవంతు కృషి చేస్తానని కలెక్టర్ అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఆయా శాఖల వారీగా విస్తృత స్థాయిలో అమలు చేస్తూ నగర అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సదుపాయాలు మెరుగుపర్చేందుకు ప్రగతి ప్రణాళిక ఎంతో చక్కటి కార్యక్రమమని, అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించి చక్కటి పేరు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవి బాబు, తహసీల్దార్ విజయ్ కాంత్ రావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం

- **గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఉద్యాన శాఖ**

**మహబూబాబాద్, విశాలభారతి:** రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సూచించారు. గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాల భాగంగా శనివారం దంతాలపల్లి, నర్సింహులపేట, నెల్లికుదురు మండలాల్లోని పలు గ్రామాలను జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, పూలు, మల్బరీ వంటి ఉద్యాన పంటల సాగు పద్ధతులు, పుట్టగొడుగుల పెంపకం, తేనెటీగల పెంపకం వంటి అదనపు ఆదాయం ఇచ్చే కార్యక్రమాలపై రైతులకు వివరించారు. అలాగే మామిడి పండ్లకు ఫ్రూట్ బాగింగ్ విధానం, పంటల సంరక్షణ, మార్కెట్ అవకాశాలు మరియు ప్రభుత్వ రాయితీ పథకాలపై సాంకేతిక సూచనలు అందించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఎకరానికి రూ.11,600 మొక్కల కోసం రాయితీ అందజేస్తుందని తెలిపారు. మొదటి నుండి నాలుగో సంవత్సరం వరకు తోటల నిర్వహణకు ప్రతి సంవత్సరం రూ.4,200 చొప్పున సహాయం లభిస్తుందని చెప్పారు. బిందు సేద్యం ఏర్పాటు కోసం రూ.22,518 వరకు సబ్సిడీ ఉండడంతో మొత్తం సుమారు రూ.50,918 వరకు రైతులు లబ్ధి పొందవచ్చని వివరించారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎం,ఐ,డి,హెచ్) ద్వారా పండ్ల తోటల విస్తరణకు కూడా రాయితీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మామిడి, నిమ్మ, జామ వంటి పంటలకు ఎకరానికి రూ.19,200 వరకు, బొప్పాయి సాగుకు రూ.7,200, డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రూ.64,800 వరకు రాయితీ ఉంటుందని తెలిపారు. అలాగే హైబ్రిడ్ కూరగాయల సాగుకు రూ.9,600, పూల సాగుకు రూ.8,000 వరకు సబ్సిడీ లభిస్తుందని వివరించారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్, కె, వి వై) పథకం ద్వారా అర ఎకరానికి శాశ్వత పందిర్ల నిర్మాణానికి రూ.50,000 వరకు సహాయం అందుతుందని పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం మల్బరీ సాగు మరియు షెడ్ నిర్మాణంతో కలిపి రెండు ఎకరాలకు రూ.5 లక్షల వరకు రాయితీ లభిస్తుందని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించి పండ్ల తోటలు, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు వంటి పంటలను సాగు చేస్తే ఎకరానికి లక్ష రూపాయల వరకు నికర ఆదాయం పొందవచ్చని అధికారులు తెలిపారు. రైతులు పొలం గట్లపై, ఇంటి పెరట్లో, డాబాలపై కూడా కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రోట్రేలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్ విధానాలు, వేప పిండి, ఆముదం పిండి వినియోగం, వేపనూనె పిచికారీ, పసుపు రంగు అట్టల వినియోగం వంటి ఆధునిక సాగు పద్ధతులను రైతులు పాటించాలని సూచించారు.

# పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి

- విద్య సంస్థల్లో పక్కాగా కామన్ డైట్ మెనూ పాటించాలి
- విద్యార్థినీ విద్యార్థులకు, సిబ్బందికి షెడ్యూలు ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలి
- పిల్లల మానసిక, ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక తరగతులు (కౌన్సిలింగ్) నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, విశాలభారతి:**



మహబూబాబాద్ జిల్లా శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, డిఇఓ,ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, డిసిఓ లతో కలిసి కలెక్టర్ విద్యాశాఖ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని అందుకు అనుగుణంగా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనారిటీ అన్ని సంక్షేమ వసతి గృహాలలో హెల్త్ ఎడ్యుకేషన్ న్యూట్రిషన్ సానిటేషన్ లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రాత్రి సమయాలలో పక్కాగా సిబ్బంది విధులలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూ పక్కాగా అమలు చేయాలని, నాణ్యమైన ఆహార పదార్థాలతో బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ సిద్ధం చేయాలని, వంట సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని తగిన జాగ్రత్తలు వహిస్తూ సిద్ధం చేసే విధంగా చూడాలని ఆమె ఆదేశించారు, విద్యార్థినీ, విద్యార్థుల మానసిక ఆరోగ్య స్థితిగతులపై సంబంధిత వైద్యుల చేత కౌన్సెలింగ్ నిర్వహించి వైద్య పరీక్షలు చేయాలని సూచించారు, విద్యాసంస్థలలో కొన్నిచోట్ల ర్యాగింగ్ జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చినదని ఎట్టి పరిస్థితులలో అలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పిల్లలకు అవగాహన కల్పిస్తూ వార్డెన్లు, రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత స్థానిక పోలీస్ డిపార్ట్మెంట్ సిబ్బంది తనిఖీలు నిర్వహించాలని తెలిపారు, ప్రతి వసతి గృహంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, అట్టి ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు, ప్రతి మాసం విద్యాశాఖ, పీఎం పోషణ్ అభియాన్, మిడ్ డే మీల్స్, తదితర పథకాలపై షెడ్యూల్ ప్రకారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు, విద్యాసంస్థలలో అందించే భోజనం ను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ నిర్వహించి ధ్రువీకరించాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, దేశీ రామ్ నాయక్, ఎంఈఓ లు, డిసిఓ లు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండల కేంద్రంలో శనివారం ఆర్మూర..మాజీ శాసన సభ్యులు ఆశన్న జీవన్ రెడ్డి జన్మదినం వేడుకలు.బి.ఆర్.ఎస్ పార్టీ మాక్లూర్ మాజీ. సర్పంచ్ అశోక్ రావు. మాక్లూర్ లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకం అర్చన నిర్వహిండం జరిగింది.అనంతరం బి ఆర్ఎస్ పార్టీ మాక్లూర్ మండల. కోఆప్షన్ మెంబర్ కో కైమాద్ నాయకులు, మంగల్పాడ్ చౌరస్తాలో గల కేక్ కట్ చేసి. ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ. జన్మదిన వేడుకలు పురస్కరించుకొన్నారు.బిఆర్ఎస్ ఉప సర్పంచ్ దర్గాల సాయిలు అనిత తాజ్ మాట్లాడుతూ.. నిండు నూరేళ్లు ఆయువు ఆరోగ్యలతో సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుని ప్రార్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ తిరుమల నర్సాగౌడ్,మాజీ సర్పంచ్ గంగాధర్, సాయన్న, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్‌కు ఘన సన్మానం



**తిరుమలగిరి, విశాలభారతి:** నల్గొండ జిల్లా కేంద్రం లో తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్మన్ గా ఎన్నికైన సంకేపల్లి రఘునందన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో గోపగోని స్వాతి రాజశేఖర్ సన్మానించినారు.నల్గొండ పట్టణ 24 వార్డ్ కార్పొరేటర్,మారగోని గణేష్ 9 డివిజన్ కార్పొరేటర్, బోనగిరి దేవేందర్ బిఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షులు,దూది మెట్ల మహేష్ బిఆర్ఎస్వి నాయకులు, బిఆర్ఎస్వి కార్యకర్తలు, కట్ట నాగేంద్రబాబు, అలెగ్జాండర్, అశోక్ ఈ కార్యక్రమంలో సంకేపల్లి నరోత్తమ్ రెడ్డి, కందుకూరి బాబు, పత్తేపురం త్రిషల్, సుమన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు జిల్లా మేరు సంఘం వాడి పరామర్శ



**జనగామ, విశాలభారతి:** జిల్లా మేరు సంఘం కొద్దిరోజులుగా మరణించిన కుటుంబాలను పరామర్శించారు అందులో భాగంగా కంచనపల్లి, గ్రామానికి చెందిన రామగిరి మాణిక్యం, రామగిరి. పుల్లయ్య, దీకొండ జగన్నాథం కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, వారి ఇంటి వద్దకు వెళ్లి మరణించిన వారి ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమం లో జనగామ జిల్లా మేరు సంఘం అధ్యక్షులు రాపర్తి ప్రశాంత్, సోమ.సత్యం, రామగిరి విజయ్ కుమార్, పొడిశెట్టి రాజు, రఘునాథ్ పల్లి మేరు సంఘం అధ్యక్షులు రామగిరి అశోక్, గూడూరు. శ్రీనివాస్, మధు, పి.యాదగిరి, సంఘ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు



**నిజామాబాద్, విశాలభారతి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లాలోని మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. మహిళలు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుకుంటూ, దేశ అభివృద్ధికి కీలకంగా మారుతున్నారని కలెక్టర్ అన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక సేవ, రాజకీయ రంగాల్లో మహిళలు ముందుండి నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి సాధించాలని ఆమె ఆకాంక్షించారు. మహిళలకు భద్రత, గౌరవం, సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని మహిళలందరికీ మరోసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు ప్రకటిస్తూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## సివిల్స్‌లో మెరిసిన భద్రాద్రి బిడ్డ

**కష్టానికి దక్కిన గొప్ప ఫలితం**



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఇల్లందుకు చెందిన యువతి అద్భుత ప్రతిభ కనబరిచి 178వ ర్యాంకు సాధించడం స్థానికంగా ఆనందాన్ని నింపింది. చిన్న పట్టణం నుంచి వచ్చిన ఆమె కష్టపడి చదివి ఈ విజయాన్ని సాధించడం అందరికీ స్ఫూర్తిగా నిలిచింది.చదువులో పట్టుదలతో ముందుకు సాగిన ఆమె, ఎన్నో కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేసింది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకంతో సివిల్స్ పరీక్షల్లో మంచి ఫలితాన్ని సాధించింది.తన విజయానికి కారణం కష్టపడి చదవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమేనని ఆమె తెలిపింది. యువత లక్ష్యాన్ని నిర్ణయించుకుని పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధ్యమేనని పేర్కొంది. ఇల్లందుకు చెందిన యువతి ఈ విజయంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆమె సాధించిన ఈ ఘనత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

## 99 డేస్ యాక్షన్ ప్లాన్ పలు అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం

- పరిశుభ్రమైన డివిజన్ లక్ష్యంగా 38 డివిజన్ 99 డేస్ యాక్షన్ ప్లాన్
- 38 వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధు చందు




**పాల్వంచ, విశాలభారతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్ ఆధ్వర్యంలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శనివారం రెండవ రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ బత్తుల మధ్య మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రత్యేక క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించి రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించడం జరిగింది.రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, బండారాలు తొలగించి పరిసరాలను శుభ్రపరచడం జరిగింది.కాలనీ వాసుల భాగస్వామ్యంతో జరగనున్న మహిళా దినోత్సవ వేడుకల కోసం ప్రాంగణాన్ని శుభ్రపరచడం జరిగిందని అన్నారు డివిజన్‌లో ఉన్నచెత్త వ్యర్థాలను తొలగించే పనులు చేయించడం మొదలు కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు.ప్రజల సమస్యల పరిష్కారం, పరిశుభ్రమైన డివిజన్ లక్ష్యంగా 38 డివిజన్ 99 డేస్ యాక్షన్ ప్లాన్ నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలిపారు.

## వెంటనే స్పందించిన కౌన్సిలర్

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డుకు నూతన రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సందర్భంలో, భారీగా వాహనాలు ప్రయాణిస్తున్న వేళ విపరీతంగా దుమ్ము,ధూళి రావడం వలన రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు,కాలనీవాసులో తీవ్ర ఇబ్బందులకు గురికావడం జరుగుతుంది. ఇట్టి విషయాన్ని వ్యాపారులు,వాహనదారులు మరియు ప్రజలు కలిసి సమస్యను స్థానిక 13వ కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ గౌడ్ కు తెలియజేయగా,వారు వెంటనే స్పందిస్తూ..చొరవ తీసుకొని వలిగొండ రోడ్డును నీళ్లను జల్లించి రోడ్డును తడపడి వారికి ఉపశమనం కలిగించారు.ఈ సందర్భంగా వాహనదారులు వ్యాపారస్తులు మరియు ప్రజలు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నారాయణపురం పంచాయతీలో ప్రజా పాలన – 99 రోజుల కార్యాచరణ



- జగన్నాథపురం ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహణ
- పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించిన గ్రామపంచాయతీ
- విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించిన అధికారులు
- గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని సర్పంచ్ పిలుపు

**అశ్వారావుపేట, విశాలభారతి :**

అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలోని జగన్నాథపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రజా పాలన - 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నారాయణపురం గ్రామ సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. పాఠశాల ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విద్యార్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో గ్రామస్తులు, అధికారులు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్య మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సేవల మెరుగుదలకు ప్రజా పాలన - 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్:**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుభ్రత పనులకు శ్రీకారం చుట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో శ్రీవాణి, ఇంచార్జి ఎంపీఓ తుల్జా ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల ఆరోగ్యానికి శుభ్రత ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు దూరమవుతాయని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ పాఠశాలలు, గ్రామ పరిసరాలను స్వచ్ఛంగా ఉంచేందుకు ముందుండాలని కోరారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు కూడా చురుకుగా పాల్గొని గ్రామ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ అంతటి సుష్మ అశోక్ గౌడ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ సెక్రటరీ, గ్రామంలోని వివిధ విభాగాల అధికారులు, గ్రామ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఓబన్న విగ్రహ ఆవిష్కరణ

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:**

ఎల్బీనగర్ నియోజకవర్గం, హయత్ నగర్ మండల కార్యాలయం సమీపంలో స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తరి భీమ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ గజ్జి భాస్కర్ యాదవ్,హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నగౌని రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్క రవీందర్ గౌడ్,భాస్కర్ సాగర్, తెలుగుదేశం పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు నక్క రంజిత్ గౌడ్ , పారంద స్వామి, ఎర్ర రవీందర్, మెకాస్ (మారి )తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో ధైర్యంగా పోరాడిన వడ్డే ఓబన్న ఒక కులానికి మాత్రమే పరిమితమైన నాయకుడు కాకుండా దేశానికి సేవ చేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.



## ప్రైవేటు పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

**సాంస్కృతిక వేషధారణలో విద్యార్థులు ప్రదర్శన**




**పాల్వంచ రూరల్, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయటం లో భాగంగా శనివారం ప్రైవేటు పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అనే నినాదానంతో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మన ఊరి బడిలోనే చదువుకుందామని నినాదాలు చేస్తూ ఎర్రగుంట ,జగ్గు తండ గ్రామంలలో విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక వేషధారణలో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ బడి యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన సాంకేతిక బోధనోపకరణాలైన ఐఎఫ్పీ టీవీలు, డిజిటల్ టీవీలు మరియు మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం,నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం,ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోట్ పుస్తకాలు, ఉచిత దుస్తులు మరియు ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన గురించి గ్రామస్తులకు వివరిస్తూ ప్రభుత్వ బడి బలోపేతానికి కృషి చేస్తున్నామనిఅన్నారు. కార్యక్రమంలో,సుధారాణి,లచ్చిరాం,శోభ,కామేష్ వెంకన్న,నరేష్, శిల్పిషా, స్వర్ణలత,కవిత , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ




**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచ పట్టణంలోని అభ్యుదయ పాఠశాల (ప్రభుత్వ ఉన్నత పాఠశాల)లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ ఫౌండర్ మరియు రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కట్ట సతీష్ పాల్గొని విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిల్‌స్‌ను అందజేశారు. ఈ నెలలో జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని సుమారు 120 మంది విద్యార్థులకు ఈ పరీక్ష సామాగ్రిని అందించడం జరిగింది. ఈ సందర్భంగా కట్ట సతీష్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ భవిష్యత్తును లక్ష్యంగా పెట్టుకొని కష్టపడి చదివి మంచి స్థానాలను సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థుల చదువులకు అవసరమైన సహాయాన్ని సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ తరఫున భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల విద్యార్థులకు ఇలాంటి సహాయం అందించినందుకు పాఠశాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం కట్ట సతీష్ ని ఘనంగా సన్మానించింది.ఈ కార్యక్రమంలో సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్, రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యదర్శి మూడ్ వీరన్న, పాల్వంచ టౌన్ ఆర్ఎల్డీ పార్టీ అధ్యక్షులు పొట్ట పింజర బ్రహ్మానంద రావు, జిల్లా విద్యార్థుల విభాగం అధ్యక్షులు పృథ్వీ నాయక్, జిల్లా మైనారిటీ సంఘ అధ్యక్షులు బన్నీ విజయ్, మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ కె, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమ గారు,మరియు ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా మహిళా దినోత్సవం



**పాల్వంచ విశాల భారతి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ZPHS యానంబైల్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు V.ఉమారాని. ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో మహిళల గొప్పతనం, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర గురించి ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు మహిళా సాధికారతపై ప్రసంగాలు చేసి, పాటలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని ఆకట్టుకున్నారు. కొందరు విద్యార్థులు మహిళల గౌరవం మరియు సమాన హక్కుల ప్రాముఖ్యత గురించి సందేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా బలమైన ఆధారమని తెలిపారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. కార్యక్రమం చివరలో విద్యార్థులకు మహిళలను గౌరవించాలని, వారి కష్టాన్ని గుర్తించాలని సూచిస్తూ మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు మంచి అవగాహన కలిగించింది.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**రాజేంద్రనగర్, విశాలభారతి:** గండిపేట్ మండలం ఖానాపూర్ గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో నేడు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 62 మంది లబ్ధిదారులకు రూ. 62 లక్షల 7,19,200 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారు మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పేదింటి యువతుల వివాహాలకు ఈ పథకాలు ఎంతో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, సిబ్బంది, స్థానిక నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- వైద్యం కోసం హాస్పిటల్ కు వచ్చే వారికి వేగంగా నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందించాలి
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవు
- జిల్లావ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, తో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న "ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్

**మహబూబాబాద్, విశాలభారతి:**



ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు. శనివారం జిల్లాలోని డోర్నకల్ మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఎంపీడీవో, తహసిల్దార్, మార్కెట్ పరిసరాలను ఆకస్మికంగా సందర్శించారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, సరైన కారణం, ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మార్కెట్ పరిసరాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు ప్రజల సౌకర్యార్థం సమస్యలను పరిష్కరించి మార్కెట్ విస్తరించి అందరికీ సౌకర్యవంతంగా ఉండాలని తెలిపారు, ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి, క్షేత్రస్థాయిలో అమలు చేస్తుందన్నారు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను పంపిణీ చేశారు, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి విభాగానికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రానున్న రోజుల్లో అన్ని విభాగాలకు సంబంధించి పక్క ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని, క్షేత్రస్థాయిలో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు జరిగే వివరాలు అంశాలను తెలియపరచాలని కలెక్టర్ కోరారు, ఈ కార్యక్రమంలో డోర్నకల్ మున్సిపల్ చైర్పర్సన్ కొండేటి రాజకుమారి, వైస్ చైర్ పర్సన్ మాదా లావణ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, తదితరులు వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీరోల్ మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**సీరోల్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని సీరోల్ మండలంలో శనివారం కళ్యాణ లక్ష్మి పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ హాజరై అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు పెద్ద ఎత్తున ఉపశమనం లభిస్తున్నదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## డ్రంకన్ డ్రైవ్ కేసులు 246 నమోదు

**జరిమానా 20,30,000 విధించిన సంబంధిత కోర్టులు**



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్,బోధన్ డివిజన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ సరిహద్దులలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగముగా తేది:2322026 నుండి తేది: 0732026 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 246 కేసుల నమోదు చేయడం జరిగింది. విరి నందర్నీ సంబంధిత కోర్టులలో హాజరుపరచగా,ఈ 246 మందికి కోర్టు లో హాజరు పరచగా వీరికి రూ: 20,30,000 జరిమానా విధించడం జరిగింది. ఇందులో 16 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని. నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్ తెలియజేయడం జరిగింది. 1) ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదు. 2) వాహనాదారులు వాహనానికిసంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోగలరు.

## నిజామాబాదు పోలీస్ కమిషనరేట్ యందు మౌఖిక విచారణ



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాదు పోలీస్ కమిషనరేట్లో మౌఖిక విచారణలు ( ఓఇ) కేసులు పెండింగ్ లో వున్నవి తొందరగా పూర్తి చేసి రిపోర్టు అందజేయవలసింగా నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య,ఐ. పి.ఎస్ ఎంక్వైరీ / విచారణ అధికారులకు తగు సూచనలు చేయనైనది. పెండింగ్లో ఉన్న 17 మౌఖిక విచారణ దర్యాప్తును ముమ్మరం చేయాలని పకడ్బందీగా విచారించి రిపోర్టు ఇవ్వవలసిందిగా ఆదేశించినారు.ఇట్టి మేళా యందు మూడు మౌఖిక దర్యాప్తులు ముగిసినందున వెంటనే దర్యాప్తు సారాంశాన్ని పంపించవలసిందిగా ఆదేశించినారు. అదేవిధంగా మిగతా వాటిని కూడా తొందరగా విచారించి వాటి యొక్క సారాంశాన్ని పంపాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఇట్టి మౌఖిక దర్యాప్తు మేళాలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్ ) బస్వా రెడ్డి,ఆర్మూర్ , బోధన్,ట్రాఫిక్, సి.టి.సి ఎ.సి.పి లు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్,మస్తాన్ అలీ,రాజశేఖర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్,దర్యాప్తు అధికారులు అదేవిధంగా కక్షిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిత తనిఖీ



**నిజామాబాద్, విశాలభారతి:** ఎడపల్లి కేంద్రంలో మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ప్రభుత్వ సలహాదారు, బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. రోగులతో మాట్లాడిన ఆసుపత్రులలో ఉన్న సమస్యలపై వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మండల వైద్యాధికారి వినీత్ కుమార్ రెడ్డి. మాట్లాడుతూ ఆసుపత్రులు ఉన్న సమస్యలపై ను పలు విషయాలపై తెలిపారు. ఆస్పత్రిలో పైకప్పు పైనుండి వర్షం నీరు కింద పడడం. పైన నీరు స్లాబ్ లో ఆగడం వలన. వర్షాకాలం నీటి రావడంతో ఇబ్బందిగా కరంగా. వర్షం నీరుతో నిలిచిపోవడం ఇబ్బందికరంగా. ప్రభుత్వ సలహాదారుకు జరిగింది. సమస్యలపై సర్పంచ్. అధికారులకు మాట్లాడడం జరిగింది. మరమ్మత్తుల పనులు చేపిస్తామని. రోగులకు అందాల్సిన సరైన వైద్యసేవలు అందేలా చూడాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని రోగులకు అందుబాటులో ఉండాలని లేని యెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, సర్పంచ్ కందగట్ల రాంచందర్, ఉప సర్పంచ్ గంగాధర్. బంజ శంకర్. వైద్య సిబ్బందిలు సుమలత. ఏడపల్లి ఎస్సై ముత్యాల రమ. ప్రజా ప్రతినిధులు వైద్య సిబ్బంది. పోలీస్ సిబ్బంది. తదితరులు ఉన్నారు.

## ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బలిజగూడ గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రం తో పాటు ప్రభుత్వ పాఠశాలలో శుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని గ్రామస్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్ కుమార్, ఉప సర్పంచ్, గ్రామ సెక్రటరీ రహీం పాషా , వీఆర్వో, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధికి మహిళలు ఆదర్శంగా నిలవాలి



**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని అన్నారు. విద్యావంతురాలైన మహిళ అన్ని రంగాల్లో తన ప్రతిభను చాటుకుని ఉన్నత స్థాయికి ఎదగగలదని తెలిపారు. సమాజ పురోగతిలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమని అన్నారు . మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిలో చాలా సంక్షేమ కార్యక్రమాలు మహిళల పేరుమీదే మంజూరు చేయబడుతున్నాయని తెలిపారు. ప్రతి రంగంలో మహిళలు ముందుకు వచ్చి తమ సామర్థ్యాలను నిరూపిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మాట్లాడుతూ మహిళల పట్ల లింగ వివక్ష తొలగింపు కుటుంబ వ్యవస్థ నుండే ప్రారంభం కావాలని అన్నారు. తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారినప్పుడే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు . పనిచేసే మహిళలపై ఎటువంటి వేధింపులు జరగకుండా ఉండేలా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి స్వర్ణలత లేనినా మాట్లాడుతూ మహిళల సాధికారతకు విద్య, అవగాహన మరియు ఆత్మ విశ్వాసం ఎంతో అవసరమని అన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. “బేటీ బచావో – బేటీ పడావో” కార్యక్రమం ద్వారా బాలికల విద్య, భద్రత మరియు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు . ప్రతి కుటుంబంలో బాలికలకు సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించారు. అలాగే ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన మహిళా కార్పొరేటర్లు, సర్పంచులు, ఉప సర్పంచులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, వివిధ శాఖల మహిళా అధికారులు, కార్పొరేటర్లు, మహిళా సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు,మహిళా సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ దొంగ అరెస్ట్

- పట్టుకున్న పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్
- వివరాలను వెల్లడించిన డిఎస్పీ సతీష్ కుమార్
- 18 బైకులు చోరీ -6 బైకులు స్వాధీనం

**పాల్వంచ రూరల్, విశాలభారతి:**




శనివారం డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో డిఎస్పి సతీష్ కుమార్ వివరాలు వెల్లడిస్తూ..ఉదయం 9 గంటల సమయంలో పాల్వంచ రూరల్ ఎస్సై తన సిబ్బంధి తో సోములుగూడెం క్లాస్ రోడ్డు వద్ద వాహనాలు తనికి చేస్తుండగా ఒక వ్యక్తి భద్రాచలం వైపు నుండి పాల్వంచ వైపుకు బైక్ మీద వస్తూ పోలీస్ వారిని అనుమానాస్పదం గా వెనుదిరగడంతో ఎస్సై తన సిబ్బంధి తో అట్టి వ్యక్తిని పట్టు కొని విచారించగా (TS04EJ2901) గల గ్లామర్ బైక్ సంబంధించిన పత్రాలు ఏమి చూపించక పోవడంతో బైక్ దొంగగా గుర్తించి విచారించగా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సుబ్బంపేట గ్రామానికి చెందిన సొంతపురి రమేష్ S/O రాంబాబు, వయసు: 39 సంవత్సరాలు గా గుర్తించని తెలిపారు.ఇట్టి (TSO4EJ2901) గ్లామర్ బైక్ ను నేను కొద్దిరోజుల క్రితం కేశవాపురం లోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ దగ్గర దొంగతనం చేశానని ఒప్పుకున్నట్లు తెలిపాడని, అంతేకాకుండా జల్సాలకు, చెడు వ్యసనాలకు , ఈజీ మణి కొరకు దొంగ తనాలకు అలవాటు పడి గత ఆరు నెలలుగా జిల్లా లోని కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు ప్రాంతాలలో సుమారు 18 బైక్ లను దొంగతనం చేయడం జరిగింది విచారణలో తేలిందని అన్నారు.అందులో 06 బైక్ లను స్వాదినం చేసుకోవడం జరిగిందన్నారు. మిగతా బైక్ లు కూడా ఏక్కడ దొంగతనం చేశాడనే వివరాలకోసం విచారణ చేపట్టామని అన్నారు.త్వరలో తెలియజేయడం జఎగుతుందని వెల్లడించారు. రూరల్ ఎస్సై. సురేష్ మరియు సిబందిని డీఎస్పీ అభినందించారు.ఈ కార్యక్రమంలో సిఐ సతీష్,పోలిష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామ హరిజన కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో మహిళా దినోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయాని ప్రధానోపాధ్యాయులు బాస్కుల అంజయ్య ఒక ప్రకటనలో తెలియజేసారు. మహిళా పేరెంట్స్ పాల్గొని సమాజానికి మహిళా యొక్క ప్రాధాన్యతను తెలియజేసారు. మధురమైన కేక్ కట్ చేసి మహిళామనులందరు ఒకరినొకరు తినిపించుకొని మధురానుభూతిని పొందామని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు శాలువాలతో మహిళా మణులందర్ని సన్మానించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా గ్రామ ప్రధమ పౌరురాలు సర్పంచ్ శ్రీమతి కొండా ఊర్మిళ మల్లారెడ్డి,మరియు వార్డు మెంబెర్స్ కొంగరి జ్యోతి రాములు, తాళ్లపల్లి వేణు, పాలడుగు నవనీత, మహిళా పేరెంట్స్ రొడ్డ రేణుక, రాపాక రమ్య, రాపాక శ్రీలత, గోపాలదాస్ ఉమ, ఉమ, అంగన్వాడీ టీచర్ శ్రీలత, ఆయా లక్ష్మి,మొదలగు వారు పాల్గొన్నారు.



## ఏఎంసి కాలనీ సమస్యల పరిష్కారం కై సర్పంచ్‌కి వినతి

**తోకల ప్రసాద్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు**



**భద్రాచలం , విశాలభారతి:** భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో గత 20 సంవత్సరాలుగా డ్రైనేజీలు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ ప్రతి ఏడాది గోదావరి వరదల సమయంలో ఇండ్లల్లో నీరు చేరి ప్రమాదకరమైన విష సర్పాలు ఇండ్లల్లోకి వస్తున్నాయని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తోకల దుర్గాప్రసాద్ సర్పంచ్కి వివరించారు. అంతే కాకుండా పక్కా డ్రైనేజీలు లేకపోవడం వలన మరుగు నీరు ఎక్కడికక్కడ నిలిచి దోమలు విజృంభిస్తున్నాయనీ. పలువురు విష జ్వరాల బారిన పడి తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారనీ ఆయన సర్పంచి దృష్టికి తీసుకెళ్లారు. తమరు దయ చేసి భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో పక్కా డ్రైనేజీని మంజూరు చేయాలని ,అలాగే కాలనీలో నీటి సదుపాయం లేని ముత్యాలమ్మ గుడి వద్ద నీటి బోరు వేయించాలని పలు సమస్యలతో కూడిన ప్రతి పత్రాన్ని అందించారు . సర్పంచ్ పూనెం కృష్ణ సమస్యలు పరిష్కరించే దాంట్లో నా వంతు కృషి తప్పని సరిగా చేస్తానని కాలనీ అభివృద్ధికి తోడ్పడుతానని సర్పంచ్ అన్నారని తెలిపారు.

## మొరంపల్లి బంజర్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత పంచాయతీ కార్యదర్శి భవాని
- ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సర్పంచ్ బొర్రా సుభద్ర
- ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తాం పాలకవర్గ సభ్యులు



**బూర్గంపాడు, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్ ప్రకారం గ్రామాల అభివృద్ధి పట్టణాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కంకణబద్ధులై ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. మేజర్ గ్రామపంచాయతీ మొరంపల్లి బంజర నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సర్పంచ్ బొర్రా సుభద్ర మొదటిరోజు శనివారం నాడు పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై దృష్టి సారించి గ్రామాల పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని అదేవిధంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటలో ప్రథమ పౌరులుగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సంత సముదాయం, అంగన్వాడి కేంద్రం మరియు ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొక్కుల రవి, పాలకవర్గ సభ్యులు రొండా పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి భవాని మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పాలమాకుల గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని గల్లంతు



**రాజేంద్రనగర్, విశాలభారతి:** పాలమాకుల గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని మంగళి చందన అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పాలమాకుల గ్రామానికి చెందిన మంగళి చందన (16) చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మార్చి 5న ఉదయం 11 గంటల సమయంలో శంషాబాద్‌కు పరీక్ష రాయడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరింది. అయితే ఆ రోజు కాలేజీలో ఎటువంటి పరీక్షలు లేవని తర్వాత కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. కుమారి చందన ఎత్తు సుమారు 5 అడుగులు, చర్మవర్ణం చామనచాయ. తెలుగు మాట్లాడగలదు. అదృశ్యమైన సమయంలో బ్లాక్ కలర్ టాప్, వైట్ కలర్ ప్యాంట్, వైట్ కలర్ చున్నీ ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న శంషాబాద్ పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు.

## రోడ్డు సమస్యను పరిష్కరించిన వాజేడు సర్పంచ్



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం అభివృద్ధి దిశగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మండలానికి రూ.1.40 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఈ నిధులతో మండలంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులలో భాగంగా వాజేడు డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో రూ.15 లక్షల వ్యయంతో వాజేడు నాగారం సర్పంచ్ బోధబోయిన స్వరూప కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విక్రాంత్ బాబు మాట్లాడుతూ, సర్పంచ్ ఎన్నికల సమయంలో డబుల్ బెడ్ రూమ్ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు అక్కడి ప్రజలు వీధి రోడ్లు సక్రమంగా లేవని తమ సమస్యను తెలియజేశారని అన్నారు. వెంటనే మంత్రి సీతక్క, ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు దృష్టికి తీసుకెళ్లడంతో రూ.15 లక్షలతో సీసీ రోడ్డుకు మంజూరు లభించిందని తెలిపారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగారం ఉపసర్పంచ్ మందపాటి సుబ్బరాజు, నాగారం మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు వత్సవాయి జగన్నాథరాజు, కాకర్లపూడి కళ్యాణ్, అనుముల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో స్పోర్ట్స్ డే ఉత్సాహంగా నిర్వహణ



**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుపుల మండలం సింగరాజు పల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పలు క్రీడా పోటీలలో పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు. వివిధ క్రీడాంశాలలో విజేతలైన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుచిత్ర ఆనంద్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా మానసిక ఉల్లాసం క్రమశిక్షణ మరియు జట్టు భావన పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరంజని, శారద, శ్రీదేవి, సునీత, ఎల్లయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ నాయకులు

**జనగామ జిల్లా నాయకులు పల్లా సుందర్ రామిరెడ్డి**



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం, సింగరాజుపల్లి తుమ్మ గార్డెన్ లో సీనియర్ నాయకులు దూలం కనుకయ్య కూతురు మేఘన మహేందర్ పెళ్లికి హాజరై మరియు మండలంలోని వివాహాది శుభకార్యాలకు హాజరై నూతన వధూవరుల దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని కోరుకుంటూ, అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన జనగామ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కత్తుల విజయ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ దాస్ మల్లేష్ బిఆర్ఎస్ నాయకులు కొమ్ము రాములు, అన్నారపు యాదగిరి, గ్రామ కమిటీ అధ్యక్షులు మేకపోతుల నరసింహ, జోగు సత్తయ్య, పరమాత్మ చారి, ఎండి పాషా, గడ్డం రాజు, అన్నారపు ప్రశాంత్, జోగు మహేందర్, రాపాక రోషాలు, జోగు సోమరాజు, జోగు శ్రీశైలం, కొమ్ము రామచంద్రు, భూమండ్ల ఈరయ్య, చింతల ధనయ్య మరియు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బిఆర్ఎస్ మండల అధ్యక్షకార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్,చింత రవి,మాజీ ఎంపీపీ కొల్లూరి సోమన్న,మండల నాయకులు ఏల సుందర్,కుతాటి నర్సింహులు,ఆలకుంట్ల యాదగిరి,వెంకన్న,యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## అందరివాడు... ఆడబిడ్డలకు అన్న..

# రేవంతన్న

**కరీంనగర్, విశాలభారతి**

అందరివాడు... ఆడబిడ్డలకు అన్న... రేవంతన్న. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వారసత్వాన్ని తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు కొనసాగిస్తున్నది. అందుచేతనే రాష్ట్రంలోని మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళేందుకు ముందడుగు వేస్తున్నది ప్రజా ప్రభుత్వం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నది మన ప్రభుత్వం. మహిళలను ప్రోత్సహించడంలో భాగంగా... సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించిన ఏకైన ప్రభుత్వం దేశంలోనే మన తెలంగాణ. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదు... ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేసింది ప్రభుత్వం. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించింది. దాంతో, తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తరచూ ఉద్ఘాటించడం ఈ ప్రాంత మహిళలు చేసుకున్న అదృష్టం. బీఆర్ఎస్ ప్రభుత్వ ఆడబిడ్డలను పట్టించుకోలేదని విమర్శలు గణనీయంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఐదేళ్ల వరకు మంత్రివర్గంలో మహిళలు లేదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం. దాంతోపాటు, త్వరలోనే చట్టసభల్లో కూడా మహిళలకు 33శాతం రిజర్వేషన్ రాబోతుందని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు పలు సందర్భాల్లో. ఏ మార్పు కావాలని ఆడబిడ్డలు ఆశీర్వదించారో ఆ మార్పు ఇప్పుడు పరేడ్ గ్రౌండ్‌లో కనిపిస్తోంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తేనే రాష్ట్రం వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ అవుతుందని ప్రభుత్వం పదేపదే చెబుతున్నది. వాటిని ఆచరణలో పెడుతూ ముందుకు వెళుతున్నది. ఆడబిడ్డలు తలచుకుంటే వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధన పెద్ద కష్టమేమీ కాదు. ఎందుకంటే, ఈ రాష్ట్రంలో 65 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. పాఠశాలల నిర్వహణ, బడి పిల్లలకు కోటి 30 లక్షల జతల యూనిఫాం కుట్టించే పని మహిళలకే అప్పగించారు. ఈ ప్రభుత్వంలో మంత్రులుగా సీతక్క, కొండా సురేఖ పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో కేబినెట్‌లో ఒక్క మహిళకు కూడా మంత్రిగా లేరు. ఇచ్చిన మాటకు కట్టుబడుండే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని అమలుచేసి వారికి ఆర్థికంగా లబ్ది చేకూర్చింది. ఉచిత ప్రయాణంలో సగటున రోజుకు 30 లక్షల మంది మహిళా ప్రయాణికులు ప్రయోజనం పొందుతుండడంతో వారికి రూ.1,500 కోట్ల ఆదా అవుతోంది. ఉచిత బస్సు పథకానికి ప్రభుత్వం ఆర్టీసీకి నెలకు రూ.455 కోట్లు చెల్లిస్తూ ఆర్థిక భారాన్ని భరిస్తోంది. గతంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీకి ఉచిత బస్సు ప్రయాణంతో ఆక్యుపెన్సీ పెరిగి లాభాల బాట పట్టింది. ఆర్థికంగా ఎన్ని సమస్యలు ఎదురైనా కుటుంబ భారం మోస్తూ కుటుంబ గౌరవాన్ని కాపాడే మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ ఇన్సూరెన్స్ పెంపు పథకాలను కూడా అమలు చేసి చేదోడుగా నిలిచి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది.



సత్తు మల్లేష్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ కమిటీ ఛైర్మన్

రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై అందిస్తున్న రూ.500 సబ్సిడీతో సుమారు 40 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో 50 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోంది. దాంతోపాటు, పేదల్లో భరోసా నింపేలా ఆరోగ్యశ్రీ పథకం కింద ఇన్సూరెన్స్‌ను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. మరోవైపు తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని పెంచేలా ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గం పరిధిలో 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరున అందజేసే ప్రక్రియ ప్రారంభించింది. అంతేకాక మహిళల పేరుమీదనే 40 లక్షలకుపైగా నూతన రేషన్ కార్డులను కూడా జారీ చేస్తుంది. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస్ తమ బాధ్యత తీరిపోయింది అనేలా కాకుండా మహిళల సమగ్రాభివృద్ధికి మరిన్ని పథకాలను ప్రారంభించింది. భారత దేశ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ పేరిట ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా బలోపేతం చేస్తోంది. కోటిమంది తెలంగాణ మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రంలోని స్వశక్తి మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 63.86 లక్షల మంది మహిళలు మహిళా సంఘాల్లో సభ్యత్వం తీసుకోవడం వారికి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం. రాష్ట్రంలో ఇంటింటికీ తిరిగి ప్రతి మహిళకు సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. మహిళా సంఘాలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఏటా 5,000 గ్రామ సంఘాలకు రూ.5,000 కోట్లు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘంలో చేరిన ప్రతి మహిళకు రూ.15.50 లక్షల ఆర్థిక సాయం అందజేయనుంది. వీరందరికీ ప్రభుత్వం రూ.5 లక్షల బీమా కల్పించనుంది. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం కోసం ఇప్పటికే అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణానికి రూ. 5 కోట్ల చొప్పున మొత్తం 22 భవనాల కోసం రూ.110 కోట్లు మంజూరు చేసింది. సిరిసిల్లలో 60 ఎకరాల్లో అపెరల్ పార్కులో రెడీమెడ్ వస్త్రాల తయారీలో ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యతనిస్తోంది. నారాయణపేటలో పూర్తిగా మహిళలే నిర్వహించేలా పెట్రోల్ బంకులు ప్రారంభించిన ప్రభుత్వం ఇకపై అన్ని జిల్లాల్లో కూడా వీటిని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తుంది. మహిళలచే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇందిరా శక్తి క్యాంటీన్లను ప్రారంభించింది. కుట్టు శిక్షణతో సహా మరో 15 వ్యాపారాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం పాఠశాలల్లో యూనిఫాం కుట్టే పనులను కూడా మహిళలకే అప్పచెప్పింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 32 జిల్లాల్లో 64 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇక కోఠిలోని మహిళా యూనివర్సిటీకి పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టి ఆమెను ప్రజా ప్రభుత్వం గౌరవించుకున్నది. సామాజికవేత్త సావిత్రీబాయి పూలే పుట్టిన రోజును మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇద్దరు మహిళలకు మంత్రి పదవులిచ్చి గౌరవించుకుంది. వడ్డీ లేని రుణాలకు సంబంధించి చెక్కులను ఇవ్వడంతో పాటు, ఏడాది కాలంలో ప్రమాదవశాత్తు మరణించిన మహిళలకుటుంబాలకు రూ.40 కోట్ల బీమా అందజేసి ప్రభుత్వం ఆదుకోనుంది. 14 వేల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగాల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసి మహిళలకు ఉపాధి కల్పనపై దృష్టిసారించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్ష తెలిసిన సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది. ఈ విషయాన్ని మన రాష్ట్ర ఆడబిడ్డలందరూ గుర్తించి రేవంతన్నకు అండగా నిలవాలి.

## దుర్గాబాయి మహిళా శిశు వికాస



- కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- ఆర్మూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లహరి హాజరు

**నిజామాబాద్**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) పెర్కిట్ లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ లహరి రఘు పాల్గొన్నారు. ఎం.పి. హెచ్. డబ్లు. (ఎఫ్) 1వ బ్యాచ్ & 2వ బ్యాచ్ శిక్షణార్థులు, బ్యూటీషియన్ శిక్షణ పొందుతున్న అభ్యర్థినిలకు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా లహరి రఘు మాట్లాడుతూ.. మార్చి 8వ తేది అనేది కేవలం క్యాలెండర్లో ఒక తేది మాత్రమే కాదని, తరతరాల నిశ్శబ్దాన్ని చేదించిన ఒక విజయ నాధమని చెప్పారు. మహిళ శ్వాశతోనే ఈ జగత్తుకు చైతన్యం సిద్ధించిందని, సృష్టికి సార్ధకత దక్కిందని తెలిపారు. మన చరిత్రలో ఝాన్సిలక్ష్మీబాయి, సరోజిని నాయుడు, కల్పనా చౌవ్లా & సావిత్రి బాయి పూలే మొదలగు అనేక వీర నారీమణుల వారి వారి రంగాలలో చేసిన విశేషమైన కృషి చేసి బావి తరాలకు మనోధైర్యం కోసం బాటలు వేశారని చెప్పారు. ప్రతి ఇంట్లో వున్న మహిళలు కూడా ఒక శక్తి స్వరూపిణి అని, తన కలలను విడిచిపెట్టి తన పిల్లల కలలను నేరవేర్చుట కోసం ఎంతో కష్టపడుతున్న మహిళలను హోమ్ మేకర్స్ అంటారు కానీ, వారు నేషన్ మేకర్స్ అని అన్నారు. కౌన్సిలర్లు తిరుమల, గీత, పి. ఇందిర తదితరులు పాల్గొన్నారు.



## అమ్మే అసలైన స్ఫూర్తి!

బాల్యం నుంచీ అన్ని రకాలుగా అండగా నిలిచిన తన తల్లే.. తనకు స్ఫూర్తి అని చెబుతున్నది రకుల్‌ప్రీత్ సింగ్. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాజాగా, ఓ జాతీయ మీడియాతో మాట్లాడింది. జీవితంలో తనకు ప్రేరణగా నిలిచిన మహిళల గురించి ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. నేటితరం మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారనీ, ప్రతిరంగంలోనూ బలమైన ప్రభావాన్ని చూపుతున్నారనీ పేర్కొన్నది. “మన చుట్టూ ఉన్న మహిళలను అభినందించడం, వారి విజయాలను గుర్తించడం, వారి కలలకు మద్దతుతోపాటు బలాన్ని కూడా అందివ్వడమే.. మహిళా దినోత్సవ ఉద్దేశం” అంటూ తన అభిప్రాయాన్ని పంచుకున్నది. ఇక స్ఫూర్తిదాయకమైన మహిళలతో సమయం గడపడమే తనకు అత్యంత ఇష్టమైన వ్యాపకాల్లో ఒకటని వెల్లడించింది. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. తన తల్లే తనకు ప్రేరణ అని చెప్పుకొచ్చింది. “మా అమ్మే నాకు స్ఫూర్తి. నా బలం. ఆమే నాకు అతిపెద్ద ప్రేరణ. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సానుకూలంగా ఉండటాన్ని మాకు బాల్యం నుంచే నేర్పించింది” అంటూ తల్లి గురించి తెలియజేసింది. ఆమెవల్లే ఈరోజు తాను ఈస్థితిలో ఉన్నాననీ వెల్లడించింది. “మా అమ్మ చిన్నప్పటి నుంచే నాకు కష్టపడి పనిచేయడం, నన్ను నేను నమ్ముకోవడం నేర్పింది. ఎల్లప్పుడూ నాపై ఎంతో నమ్మకం ఉంచేది. నేను కూడా ఆమె నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నా! ఇక మా అమ్మ ప్రతి బాధ్యతనూ ఎంతో దయతో నిర్వహించేది. అందుకే.. ఎన్నో విషయాల్లో నాకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది” అంటూ చెప్పుకొచ్చింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.